మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 24-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 236 Issue: 236

24 ఫిబ్రవరి 2026 - మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:41 సూర్యాస్తమయం - సా. 6:17 తిథి సప్తమి ఉ. 7:02 వరకు ౦ తరువాత నవమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం కృతిక మ. 3:06 వరకు తరువాత రోహిణి యోగం ఇంద్ర ఉ. 7:15 వరకు కరణం వనిజ ఉ. 7:02 వరకు విష్టి సా. 5:57 వరకు వర్జ్యం ఉ. 6:08 నుండి ఉ. 7:38 వరకు దుర్ముహూర్తం ఉ. 9:00 నుండి ఉ. 9:47 వరకు రా. 11:14 నుండి రా. 12:04 వరకు రాహుకాలం మ. 3:23 నుండి సా. 4:50 వరకు యమగండం ఉ. 9:35 నుండి ఉ. 11:02 వరకు గుళికాకాలం మ. 12:29 నుండి మ. 1:56 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:05 నుండి తె. 5:53 వరకు అమృత ఘడియలు మ. 12:50 నుండి మ. 2:20 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:06 నుండి మ. 12:52 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com




## 99 లక్షలు కాజేశారు!

### నెల పాటు రిటైర్డ్ టీచర్ డిజిటల్ అరెస్ట్..గుజరాత్‌లోని గాంధీనగర్‌లో వెలుగులోకి

సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. అమాయక ప్రజల భయాన్నే పెట్టుబడిగా మార్చుకుని అడ్డంగా దోచుకుంటున్నారు. ఒక రిటైర్డ్ స్కూల్ టీచర్‌ను నెలరోజుల పాటు డిజిటల్ అరెస్ట్‌లో ఉంచి రూ. 99 లక్షలు దోచుకున్నారు.

గాంధీనగర్: గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఈ దారుణం వెలుగు చూసింది. గాంధీనగర్ సెక్టార్-8లో నివసించే 65 ఏళ్ల రిటైర్డ్ టీచర్‌కు జనవరి 16న ఒక గుర్తుతెలియని నంబర్ నుండి ఫోన్ వచ్చింది. ఆమె పేరు మీద ఉన్న సిమ్ కార్డును అక్రమ కార్యకలాపాలకు, బెదిరింపు కాల్స్ చేయడానికి ఉపయోగిస్తున్నారని అవతలి వ్యక్తి భయపెట్టాడు. కొద్దిసేపటికే అజయ్ గుప్తా తరువాయి 2 వ పేజీలో...



## దొంగ ఫ్రెండు.. దోచేశాడు!

### బ్యాంక్ డిటెయిల్స్ ఇస్తే 7 కోట్ల స్కాంలో ఇరికించాడు

### సైబర్ స్కాంలో ఇరుక్కున్న బెంగళూరు విద్యార్థి

బెంగళూరు: స్నేహితుడే కదా అని నమ్మి బ్యాంక్ డిటెయిల్స్ చెప్తే ఏకంగా రూ. 7 కోట్ల సైబర్ ఫ్రాడ్ చేశాడో దొంగ ఫ్రెండ్. బెంగళూరులోని ఒక ప్రముఖ కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి, తన స్నేహితుడి మాటలు నమ్మి ఇప్పుడు కటకటాల పాలయ్యే పరిస్థితి తెచ్చుకున్నాడు. సదరు విద్యార్థికి 'ఆయుష్' అనే వ్యక్తితో ఏడాది కాలంగా పరిచయం ఉంది. గతేడాది నవంబర్‌లో ఆయుష్ తన తరువాయి 2 వ పేజీలో...

# కడుపు కొట్టిన రాళ్ల వాన!

### పలు జిల్లాల్లో భారీ వర్షాలు.. ఈదురుగాలులతో బీభత్సం

### మారిపోయిన వాతావరణం..పలు పంటలకు తీవ్ర నష్టం



(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం అకస్మాత్తుగా భారీ వర్షాలు కురిశాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి.. రాళ్లు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సిద్దిపేట జిల్లా, నిర్మల్ జిల్లాల్లో రాళ్ల వాన బీభత్సం సృష్టించింది. ఈ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. విద్యుత్ సరఫరాకి కూడా అంతరాయం కలిగింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాంతంలో వడగళ్ల వాన తీవ్రంగా కురిసింది. భారీ గాలులు, వడగండ్ల కారణంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడటంతో స్థానికంగా



## రంజాన్ రోజు బడ్జెట్

### మార్చి 16 నుంచి అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన తెలంగాణ కేబినెట్ బడ్జెట్ సమావేశాల తేదీలను నిర్ణయించింది. మార్చి 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. మార్చి 16వ తేదీన గవర్నర్ ప్రసంగం.. మార్చి 17, 18వ తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. మార్చి 20న ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను సభలో -2 వ పేజీలో...

# సర్కారు వారి మెట్రో

## ఎల్ అండ్ టీ నుంచి ప్రభుత్వానికి ఫేజ్-1

### జనగణన కోసం మే 11 నుంచి ఇండ్ల లెక్కలు.. ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత ప్రమాద బీమా

### తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు.. వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థలో కీలకంగా మారిన మెట్రో రైలు ఫేజ్-1ను (69 కిలోమీటర్లు) ఎల్అండ్‌టీ సంస్థ నుంచి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకోనుంది. ఈ మేరకు సోమవారం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ఫేజ్-2ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా నిర్మించాలని నిర్ణయించారు.



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): అయితే ఫేజ్-2 పనులను చేపట్టడానికి ఎల్ అండ్ టీ విముఖత చూపడంతో, మొత్తం మెట్రో వ్యవస్థను ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు ఫేజ్-1 టేకోవర్ అనివార్యమైంది. సుమారు రూ.15 వేల కోట్లు చెల్లించి ఎల్ అండ్ టీ నుంచి దీనిని స్వాధీనం చేసుకోవాలని సబ్ కమిటీ నివేదిక ఇవ్వగా, కేబినెట్ ఆమోదం తెలిపింది. త్వరలో 86.1 కిలోమీటర్ల మేర జరగబోయే ఫేజ్-2 విస్తరణకు ఈ నిర్ణయం మార్గం సుగమం చేసింది. అటు.. తెలంగాణ మంత్రివర్గం ఉచిత ప్రమాద బీమా, క్యాష్ లెస్ ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్, హైదరాబాద్ మెట్రో టేకోవర్, హెచ్ఎండీఏ విస్తరణ, తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు


| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,135 |
| వెండి (గ్రాము): | రూ.300 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,307 |

## ఉద్యమకారులకు ఇళ్లు, పెన్షన్లు

### మంజూరుకు హైకోర్టు ఆదేశాలు

### నాలుగు వారాల్లో అమలుకు హుకుం

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు సంబంధించి తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ లను అమలు చేయలేదని ఆరోపిస్తూ ఉద్యమకారులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, అభయహస్తం పథకం కింద దరఖాస్తు చేసుకున్న అర్హూ లైన వారికి ఎనిమిది వారా ల్లోగా ఇండ్ల స్థలాలు, పెన్షన్లు మంజూరు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): రాష్ట్ర సాధన కోసం పోరా డిన ఉద్యమకారులకు సంక్షేమ చర్యలు తీసు కుంటామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించినప్పటికీ వాటి అమలులో ఆలస్యం జరుగుతోందని ఉద్యమ జేఏసీ నాయకులు కోర్టును ఆశ్రయించారు. ఉద్యమకారులకు పెన్షన్, నివాస స్థలాల కేటాయింపు వంటి అంశాల్లో ప్రభుత్వం స్పందించడం లేదని పిటిషన్‌లో పేర్కొ న్నారు. పిటిషనర్ల తరఫున

## నేడు ఈసీ చారిత్రక భేటీ

### 27 ఏళ్ల తర్వాత తొలిసారి.. ఢిల్లీలో రౌండ్ టేబుల్ మీట్

భారత ఎన్నికల సంఘం మంగళవారం అన్ని రాష్ట్రాల కమిషనర్లతో సమావేశం కానుంది. సెంట్రల్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ అధ్యక్షతన ఢిల్లీలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. కేంద్ర ఎన్నికల విభాగాలతోపాటు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల సంఘాల కమిషనర్లు, సాంకేతిక నిపుణులు, అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు పాల్గొననున్నారు. ఈ మీటింగ్ 27 సంవత్సరాల తర్వాత నిర్వహిస్తున్నారు.




న్యూఢిల్లీ: గత సమావేశం 1999వ సంవత్సరంలో జరిగింది. దేశవ్యాప్తంగా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపడుతున్న నేపథ్యంలో 27 ఏళ్ల తర్వాత మళ్లీ సమావేశం కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, తరువాయి 2 వ పేజీలో...




## ముకుల్ రాయ్ కన్నుమూత

### గుండెపోటుతో కేంద్ర మాజీమంత్రి మృతి

### బెంగాల్ రాజకీయాల్లో విషాదం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ధృవతార, తృణమూల్ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యుడు ముకుల్ రాయ్ (71) కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



చరిత్రలో తొలిసారి 40 ఏళ్ల ఆస్ట్రేలియా వ్యక్తి దాదాపు 100 రోజుల పాటు టైటానియంతో తయారుచేసిన కృత్రిమ గుండెతో బతికారు. ఓ దాత తన గుండెను దానం చేయడంతో కృత్రిమ గుండెను తొలగించి, దాత గుండెను అమర్చారు.

# సోషల్ మీడియా.. 'స్కూలు పిల్లలకు నో'!

### కీలక నిర్ణయం దిశగా ఏపీ సర్కారు అడుగులు

### నియంత్రణ, తప్పుడు ప్రచారం కట్టడికి కేబినెట్ సబ్ కమిటీ

### జాతీయ విధానం కోసం కేంద్రానికి టీడీపీ విజ్ఞప్తి

ఏపీలో సోషల్ మీడియా వినియోగంపై కఠిన నిబంధనలు తీసుకొచ్చేందుకు అక్కడి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులను సోషల్ మీడియాకు దూరం పెట్టేలా ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని యోచిస్తున్నట్లు రాష్ట్ర హోంమంత్రి అనిత తెలిపారు.



విజయవాడ, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై సోమవారం శాసనసభలో జరిగిన చర్చలో ఆమె ఈ కీలక విషయాన్ని వెల్లడించారు. సోషల్ మీడియాను నియంత్రించడం, అసత్య తరువాయి 2 వ పేజీలో...



## వెంటనే ఇరాన్‌ను వీడండి

### భారత పౌరులకు ఎంబసీ అడ్వైజరీ

### యూఎస్ రాయబారులకూ ట్రంప్ ఆదేశాలు... ఇరాన్‌లో పరిస్థితి ఉద్రిక్తం

## రాశి ఫలాలు
24.2.2026

మేషం: కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు తొలగుతాయి. వృత్తి వ్యాపార కొన్ని వ్యవహారాలలో పట్టుదలతో ముందుకు సాగుతారు. ముఖ్యమైన కార్యక్రమాలలో అవరోధాలు అధిగమిస్తారు. ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోకపోవడం మంచిది. స్వల్ప ధనలాభం సూచనలు ఉన్నవి. ఉద్యోగ వాతావరణం ఆశాజనకంగా ఉంటుంది.

వృషభం: ఇంటాబయట గందరగోళ పరిస్థితులు ఉంటాయి. జీవిత భాగస్వామి ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ముఖ్యమైన వ్యవహారాలు సకాలంలో పూర్తికాక చికాకులు పెరుగుతాయి. అవసరానికి చేతిలో ధనం నిల్వ ఉ ండదు. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగస్థులకు శ్రమకు తగిన ఫలితం ఉండదు.

మిధునం: నూతన వ్యాపార ప్రారంభానికి పెట్టుబడులు అందుతాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. చిన్ననాటి మిత్రులతో కలిసి కష్టసుఖాలు పంచుకుంటారు. నూతన వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఆర్థికంగా అనుకూలత పెరుగుతుంది. పాత ఋణాల తీర్చగలుగుతారు. సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

కర్కాటకం: నూతన విషయాలపై ఆసక్తి పెరుగుతుంది. సోదరులతో స్థిరాస్థి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఆర్థికంగా పరిస్థితి కొంత మెరుగుపడుతుంది. నూతన భూ సంబంధిత క్రయవిక్రయాలలో లాభాలు అందుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి.

సింహం: ఉద్యోగస్తులకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆటుపోట్లు అధిగమించి లాభాల అందుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాల్లో కీలక నిర్ణయాలు తీసుకుని సకాలంలో పూర్తి చేస్తారు. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. ఆరోగ్యవిషయంలో అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు.

కన్య: నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. దూరపు బంధువుల నుండి అందిన వార్త ఆనందం కలిగిస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలలో చర్చలు అనుకూల ఫలితాన్నిస్తాయి. స్థిరాస్థి క్రయవిక్రయాలలో నూతన లాభాలు పొందుతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు.

తుల: చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. ఆర్థికంగా గతం కంటే మెరుగైన పరిస్థితులు ఉంటాయి. నూతన ఋణప్రయత్నాలు కలసి వస్తాయి. గృహ నిర్మాణ ఆలోచనలు ఆచరణలో పెడతారు. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తాయి.

వృశ్చికం: దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుండి కొంత ఉ పశమనం లభిస్తుంది. చేపట్టిన పనులలో అధిక శ్రమకు అల్ప ఫలితాన్ని పొందుతారు. ముఖ్యమైన వ్యవహారాలు మందగిస్తాయి. జీవిత భాగస్వామ్య సలహాలు కొన్ని విషయాలలో కలసివస్తాయి. చిన్ననాటి మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

ధనస్సు: చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో స్వల్ప లాభాలను అందుకుంటారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొని మానసిక ప్రశాంతత పొందుతారు.

మకరం: భాగస్వామ్య వ్యాపారాలు లాభాల బాట పడతారు. క్రయవిక్రయాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. రాజకీయ సంబంధిత చర్చలో పాల్గొంటారు. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ప్రముఖులతో పరిచయాలు కలుగుతాయి.

కుంభం: ధన పరమైన ఇబ్బందులు కొంత చికాకు కలిగిస్తాయి. కుటుంబ విషయాలపై పెద్దలతో చర్చలు జరుపుతారు. చేపట్టిన వ్యవహారాలు అనుకూలంగా సాగుతాయి. చాలా కాలంగా వేచిచూస్తున్న అవకాశాలను దక్కించుకుంటారు. కుటుంబ సభ్యులతో విలువైన సమయాన్ని గడుపుతారు.

మీనం: చేపట్టిన పనులలో తొందరపాటు మంచిది కాదు. పాత మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు ఉంటాయి. బంధుమిత్రులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. భాగస్వామ్య వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుకుంటారు.

# సర్కారు వారి మెట్రో

మొదటి పేజీ తరువాయి

కీలక భూ కేటాయింపులు, ఇందిరమ్మ ఇండ్లపై నిర్ణయాలు తీసుకుంది. ఈ వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాకు వెల్లడించారు. సుదీర్ఘంగా సాగిన కేబినెట్ భేటీలో ప్రధానంగా ప్రభుత్వ ఉ ద్యోగుల సంక్షేమం, ఆరోగ్య భద్రతతో పాటు హైదరాబాద్ మహానగర అభివృద్ధి, భూ కేటాయింపులపై కేబినెట్ విస్తృతంగా చర్చించింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం దేశంలోనే తొలిసారిగా ఉచిత ప్రమాద బీమా పథకాన్ని, అలాగే నగదు రహిత వైద్య సేవల కోసం 'క్యాష్ లెస్ ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్'ను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటితో పాటు ప్రతిష్టాత్మక హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును ఎల్ అండ్ టీ సంస్థ నుంచి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే భారీ ప్రతిపాదనకు సైతం మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ టేకోవర్‌తో మెట్రో రెండో దశ విస్తరణ మరింత వేగవంతం కానుంది. వైద్య రంగంలో సంస్కరణలు, హెచ్ఎండీఏ పరిధిలోకి కొత్త గ్రామాల చేరిక, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, 2027 జనగణన ఏర్పాట్లు లాంటి పలు ఇతర కీలకమైన అంశాలపై కూడా కేబినెట్ సానుకూల నిర్ణయాలు తీసుకుంది.

### ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత ప్రమాద బీమా

రాష్ట్రంలో పనిచేస్తున్న 5 లక్షల 19 వేల మంది రెగ్యులర్ ఉద్యోగులు, 2 లక్షల 38 వేల మంది పెన్షనర్లకు పూర్తి భద్రత కల్పిస్తూ ప్రభుత్వం కొత్త ప్రమాద బీమా పథకాన్ని ప్రకటించింది. ఉద్యోగులు ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేకుండానే బ్యాంకర్ల ద్వారా ఈ బీమాను అమలు చేయనున్నారు. ఈ పథకం కింద ఎవరైనా ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.1.2 కోట్ల భారీ పరిహారం అందుతుంది. అలాగే 60 ఏళ్ల లోపు వయసున్న ఉద్యోగులు సహజ మరణం చెందితే రూ.10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. సింగరేణి, ట్రాన్స్‌కో సంస్థల్లో విజయవంతమైన ఈ విధానాన్ని ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నారు. ఇక, దీర్ఘకాలంగా ఉద్యోగులు ఎదురుచూస్తున్న క్యాష్ లెస్ ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్‌కు కేబినెట్ పచ్చజెండా ఊపింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు కలుపుకుని మొత్తం 17.07 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 652 ఎంప్యానెల్ ప్రైవేట్ ఆసుపత్రులు, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మొత్తం 1998 రకాల వైద్య చికిత్సలు ఉచితంగా అందిస్తారు. దీని కోసం ప్రతి ఉద్యోగి బేసిక్ పే నుంచి 1.5 శాతం వాటా తీసుకుని, దానికి సమానమైన మొత్తాన్ని (సుమారు రూ. 528 కోట్లు) ప్రభుత్వం తన వాటాగా కలుపుతుంది. మొత్తం రూ.1056 కోట్లతో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు జారీ చేస్తారు.

### వైద్య ఆరోగ్య శాఖలో భారీ సంస్కరణలు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్‌గా మార్చుతూ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనివల్ల నిధుల కేటాయింపు, మందుల కొనుగోలు, సిబ్బందికి వేతనాల చెల్లింపు వేగవంతం అవుతాయి. అలాగే రాష్ట్రంలోని ఆసుపత్రుల నిర్వహణలో సంస్కరణలు తీసుకురావడానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. డాక్టర్ నోరి దత్తాత్రేయ, డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి సలహాలతో ఆసుపత్రుల్లో అడ్మినిస్ట్రేటివ్, మెడికల్ సర్వీసెస్‌ను వేరు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. హైదరాబాద్ అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధిలోకి కొత్తగా వికారాబాద్ జిల్లాకు చెందిన నాలుగు గ్రామాలను (చిట్టిగూడ, యావపూర్, టేకులపల్లి, ఎంకతాల) చేర్చారు. అలాగే జీహెచ్ఎంసీ పరిధిలో కాంప్రెహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రామ్ (సీఆర్ఎంపీ ఫేజ్ 2) కింద రూ.3145 కోట్లతో మరో 300 కిలోమీటర్ల రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. నగరంలో నీటి ఎద్దడి నివారించడానికి రూ.722 కోట్లతో మంజీరా వాటర్ సప్లై ఆధునీకరణ, రూ.282 కోట్లతో ఉస్మాన్ సాగర్ మంచినీటి పైపులైన్ల ఆధునీకరణకు పచ్చజెండా ఊపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న 2027 జనగణన కోసం రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. తొలి దశలో భాగంగా మే 11 నుంచి జూన్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇండ్ల గణన (హౌజ్ లిస్టింగ్) జరగనుంది. ఈ ప్రక్రియలో 89 వేల మంది ఉద్యోగులు పాలుపంచుకుంటారు. అలాగే పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ ద్వారా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టాలని, డబుల్ బెడ్రూమ్ ఇండ్ల వద్ద నిర్మించిన దుకాణాలను వేలం వేయాలని మంత్రివర్గం నిర్ణయించింది.



### వివిధ జిల్లాల్లో భూ కేటాయింపులు:

- రంగారెడ్డి జిల్లా కోహెడలో లాజిస్టిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ పార్క్ కోసం 223.09 ఎకరాలు.
- ప్రపంచ స్థాయి పండ్ల మార్కెట్ కోసం వ్యవసాయ మార్కెటింగ్ విభాగానికి 239 ఎకరాలు.
- మహబూబాబాద్‌లో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీకి 70 ఎకరాలు, సిద్దిపేటలో శాతవాహన ఇంజనీరింగ్ కాలేజీకి 36 ఎకరాలు.
- 10 జిల్లాల్లో 21 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి భూములు.
- హైదరాబాద్ ఎలివేటెడ్ కారిడార్ల కోసం డిఫెన్స్ భూములు తీసుకున్నందున, దానికి బదులుగా కాప్రాలో రక్షణ శాఖకు 153 ఎకరాల కేటాయింపు.- ఖమ్మం ధంసలాపురంలో టీటీడీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి 20 ఎకరాలు.

# కడుపు కొట్టిన రాళ్ల వాన!

మొదటి పేజీ తరువాయి

విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ వడగళ్ల వాన కారణంగా ముఖ్యంగా మిర్చి, పత్తి, ఇతర వాణిజ్య పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన రైతులు ఒక్కసారిగా నష్టపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలుల తీవ్రతకు చెట్లు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. అలాగే సిద్దిపేట, దుబ్బాక పట్టణాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షపు నీటితో పలు రహదారులు జలమయమయ్యాయి. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో కొన్ని ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి. వర్షాలతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఎండ తీవ్రత పెరుగుతున్న వేళ.. ఒక్కసారిగా రాళ్ల వాన, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలకు ఉపశమనం లభించింది.

# 99 లక్షలు కాజేశారు!

మొదటి పేజీ తరువాయి

అనే వ్యక్తి సీబీఐ అధికారిగా పరిచయం చేసుకుంటూ ఆమెకు వీడియో కాల్ చేశాడు. ఒక మనీ లాండరింగ్ కేసులో ఆమె బ్యాంక్ ఖాతాలు లింక్ అయ్యాయని, ఆమెను అరెస్ట్ చేసే అవకాశం ఉందని హెచ్చరించాడు. బాధితురాలిని మరింత నమ్మించడానికి టెలికమ్యూనికేషన్స్ శాఖ అధికారులమంటూ మరికొందరు కేటుగాళ్లు రంగంలోకి దిగారు. నేరగాళ్లు ఆమెను భయపెట్టేందుకు వాట్సాప్ ద్వారా కొన్ని పత్రాలను పంపారు. భారత సుప్రీంకోర్టు పేరిట ఉన్న నకిలీ ఉత్తర్వులు, ఫోర్జరీ చేసిన అరెస్ట్ వారెంట్లు, ముంబై క్రైమ్ బ్రాంచ్ రికార్డులు ఉన్నాయి. వీటిని చూసి భయపడిన ఆమెను ఎవరికీ ఫోన్ చేయవద్దని ఆదేశించారు. ఆమె ఎక్కడికి వెళ్తున్నది నిరంతరం మెసేజ్‌ల ద్వారా తెలపాలని ఆదేశిస్తూ, దాదాపు 28 రోజుల పాటు డిజిటల్ అరెస్ట్ లో ఉంచారు. ఆమె ఆర్థిక స్థితిని తెలుసుకుని, కేసు నుండి పేరు తొలగిస్తామనే సాకుతో ఆమెపై ఒత్తిడి తెచ్చారు. ఫిబ్రవరి 5 నుండి 13వ తేదీ మధ్యలో ఆమె తన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పోస్ట్ ఆఫీస్ అకౌంట్ల నుండి వివిధ ఖాతాలకు రూ. 99 లక్షలను బదిలీ చేయించుకున్నారు. డబ్బులు పంపిన తర్వాత వారు తిరిగి స్పందించకపోవడంతో.. తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు ఫిర్యాదు చేశారు.

# రంజాన్ రోజు బడ్జెట్

మొదటి పేజీ తరువాయి

ప్రవేశ పెట్టనున్నారు. మార్చి 19వ తేదీన తెలుగు సంవత్సరాది అయిన ఉగాది పండుగ.. 20వ తేదీన ముస్లిం పండగ రంజాన్ ఉండటం గమనార్హం. అనూహ్యంగా బడ్జెట్ ప్రవేశ పెట్టే రోజు.. రంజాన్ పండగ ఒకేరోజు కావడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది. మరోవైపు.. తెలంగాణ కేబినెట్ సమావేశంలో మరిన్ని నిర్ణయాలకు ఆమోదం లభించింది.

# నేడు ఈసీ చారిత్రక భేటీ

మొదటి పేజీ తరువాయి

పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని సంబంధిత విభాగాలు తెలిపాయి. ఎన్నికల నిర్వహణ వ్యూహాలు, లాజిస్టిక్స్, చట్టపరమైన అంశాల్లో సహకార సమాఖ్య స్ఫూర్తిని చాటేలా చర్చలు జరగనున్నాయి. 73, 74 రాజ్యాంగ సవరణల ప్రకారం రాష్ట్ర ఎన్నికల సంఘాలు.. పంచాయతీలు, మున్సిపాలిటీ, జిల్లా, మండల పరిషత్ ఎన్నికల నిర్వహణ బాధ్యతను కలిగి ఉన్నాయి. ఆర్టికల్ 243కే, 243జెడ్ఏ కింద ఎస్ఈసీకి ఉన్న అధికారాలు, ఓటర్ల జాబితా తయారీలో 1950 ప్రజా ప్రాతినిధ్య చట్టం అమలు, ఈవీఎంల పనితీరు, ఓటర్ల జాబితా రూపకల్పన, సాంకేతికత వినియోగం వంటి అంశాలపైనా ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించనున్నట్లు తెలుస్తోంది.

# దొంగ ఫ్రెండు.. దోచేశాడు!

మొదటి పేజీ తరువాయి

బ్యాంక్ అకౌంట్ బ్లాక్ అయ్యిందని, అత్యవసరమైన లావాదేవీల కోసం అకౌంట్ కావాలని కోరాడు. స్నేహితుడే కదా అని నమ్మిన ఆ విద్యార్థి కర్ణాటక గ్రామీణ బ్యాంక్ లోని తన ఖాతా వివరాలన్నీ అతడికి అప్పగించాడు. బ్యాంక్ అకౌంట్ నెట్ బ్యాంకింగ్ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చేశాడు. ఏటీఎంకు లింక్ అయిన ఎయిర్‌టెల్ సిమ్ కార్డును కూడా కొరియర్ ద్వారా పంపాడు. కొన్ని నెలల తర్వాత సదరు విద్యార్థికి బ్యాంక్ నుంచి ఫోన్ రావడంతో అసలు విషయం బయటపడింది. అతడి అకౌంట్ ద్వారా ఏకంగా రూ.7 కోట్ల అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు అధికారులు గుర్తించారు.

# సోషల్ మీడియా.. 'స్కూలు పిల్లలకు నో'!

మొదటి పేజీ తరువాయి

ప్రచారానికి అడ్డుకట్ట వేయడం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఒక కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిందని మంత్రి అనిత వివరించారు. ఈ కమిటీ ఇప్పటికే రెండుసార్లు సమావేశమైందని, పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించిందని తెలిపారు. తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను కమిటీ సమీక్షించిందని, రాష్ట్రంలో సమర్థవంతంగా పనిచేసే చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని పేర్కొన్నారు. విద్వేషపూరిత, అసభ్యకరమైన పోస్టులను నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి పోస్టులకు సంబంధించి 1,384 కేసులు నమోదు చేసి, 1,067 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని ఆమె సభకు తెలియజేశారు. గతంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా 'వయసుకు తగిన సోషల్ మీడియా వాడకం' కోసం చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌లను అధ్యయనం చేస్తామని ప్రకటించారు. "సోషల్ మీడియాపై నమ్మకం తగ్గిపోతోంది. పిల్లలు దాని వాడకంలో కూరుకుపోయి చదువుపై ఏకాగ్రత కోల్పోతున్నారు. మహిళలు ఆన్‌లైన్‌లో తీవ్రమైన వేధింపులకు గురవుతున్నారు. దీన్ని ఉపేక్షించలేం" అని లోకేశ్ గతంలో 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మెటా, ఎక్స్, గూగుల్, షేర్‌చాట్ వంటి ప్రధాన సోషల్ మీడియా సంస్థలను తదుపరి మంత్రుల బృందం సమావేశానికి ఆహ్వానించామని తెలిపారు. 16 ఏళ్లలోపు పిల్లలకు కొన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై ఆంక్షలు విధించే అవకాశాన్ని కూడా ఈ కమిటీ పరిశీలిస్తోంది. ఈ అంశాన్ని టీడీపీ జాతీయ స్థాయిలోనూ ప్రస్తావించింది. ఫిబ్రవరి 10న టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పిల్లల కోసం సోషల్ మీడియాపై వయోపరిమితితో కూడిన నియంత్రణ తీసుకురావాలని కోరారు. దీనిపై అధ్యయనం చేసి ఒక సమగ్ర జాతీయ విధానాన్ని రూపొందించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీయే ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోందని, పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం పటిష్టమైన చట్టాన్ని రూపొందించే పనిలో ఉందని కేంద్ర మంత్రికి వివరించారు.

## భారత పౌరులకు ఎంబసీ అడ్వైజరీ

### యూఎస్ రాయబారులకూ ట్రంప్ ఆదేశాలు

### ఇరాన్‌లో పరిస్థితి ఉద్రిక్తం

న్యూఢిల్లీ/టెహ్రాన్: ఏ క్షణమైనా ఇరాన్‌పై అమెరికా దాడులు చేయవచ్చునన్న అంచనాలు, విద్యార్థుల ఆందోళనలతో ఆ దేశంలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని భారత పౌరులకు అక్కడి మన ఎంబసీ తాజాగా అడ్వయిజరీ జారీచేసింది. తక్షణమే ఆ దేశాన్ని వీడాలని సూచించింది. 'ఇరాన్‌లో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా జనవరి 5న భారత ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు కొనసాగింపుగా మళ్లీ అడ్వయిరీ జారీ చేస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారతీయులు (విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు) కమర్షియల్ విమానాలతో సహా అందుబాటులో ఉన్న ప్రయాణ మార్గాల ద్వారా ఇరాన్‌ను తక్షణమే విడిచిపెట్టి వెళ్లండి. భారత పౌరులు, భారత సంతతి వ్యక్తులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించండి. ఆందోళనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండండి. ఇరాన్‌లోని భారత ఎంబసీతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ ఉండండి' అని ఇరాన్‌లోని భారత ఎంబసీ తన అడ్వయిజరీలో పేర్కొన్నది. అలాగే తాజా పరిణామాల సమాచారం కోసం స్థానిక మీడియాను గమనిస్తూ ఉండాలని సూచించింది. భారతీయులంతా పాస్‌పోర్ట్‌లు, ఐడీ కార్డులతో సహా తమ ప్రయాణ, ఇమిగ్రేషన్ పత్రాలను ఎల్లప్పుడూ తమవద్ద సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పింది. ఈ విషయంలో ఎలాంటి సాయం కోసమైనా భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొంది. ఇప్పటివరకు ఎంబసీ వద్ద మీ పేర్లు నమోదు చేసుకోకపోతే వెంటనే రిజిస్టర్ చేయించుకోవాలి' అని భారత ఎంబసీ తన అడ్వయిజరీలో తెలిపింది. ఇరాన్-అమెరికా దేశాల మధ్య అణు చర్చలు ఇప్పటికీ కొలిక్కిరాలేదు. ఈ చర్చలు విఫలమైతే ఇరాన్‌పై దాడికి వెనుకాడబోమని అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఇప్పటికే అమెరికా పలు విమాన వాహక నౌకలు, జలాంతర్గాములు, ఫైటర్ జెట్‌లను పశ్చిమాసియాలో మోహరించింది. ఈ నేపథ్యంలోనే టెహ్రాన్‌లో మరోసారి ఆందోళనలు చెలరేగాయి. పలు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఈ పరిణామాలతో ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## ఉద్యమకారులకు ఇళ్లు, పెన్షన్లు

మొదటి పేజీ తరువాయి

హైకోర్టు న్యాయవాది జి. కరుణాకర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రభుత్వం ప్రకటించిన పథకాలను అమలు చేయడం రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని తెలిపారు. అభయహస్తం పథకం కింద దరఖాస్తు చేసుకున్న ఉద్యమకారులకు ఇప్పటి వరకు ప్రయోజనాలు అందలేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం తరఫున న్యాయవాదులు పథకాల అమలుకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోందని కోర్టుకు తెలియజేశారు. అర్హుల గుర్తింపు, దరఖాస్తుల పరిశీలన జరుగుతోందని వివరించారు. హైకోర్టు కీలక ఆదేశాలు ఇరువైపుల వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి విజయసేన్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు.

## ముకుల్ రాయ్ కన్నుమూత

మొదటి పేజీ తరువాయి

బాధపడుతున్న ఆయన.. సోమవారం తెల్లవారుజామున కోల్‌కతాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. తెల్లవారు జామున ఆయనకు హఠాత్తుగా గుండెపోటు రావడంతో మరణించినట్లు ఆయన కుమారుడు సుబ్రాన్షు రాయ్ ధృవీకరించారు. ఆయన మృతితో బెంగాల్ ప్రజలంతా కన్నీరుమున్నీరు అవుతున్నారు. 71 ఏళ్ల వయసు కల్గిన ముకుల్ రాయ్ ఓ రాజకీయ నాయకుడిగానే కాకుండా సీఎం మమతా బెనర్జీ రాజకీయ ప్రస్థానంలో ఒక శక్తిమంతమైన వ్యూహకర్తగా కూడా నిలిచారు. ముఖ్యంగా టీఎంసీ ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించిన ఆయన.. పార్టీలో మమత తర్వాత రెండో అత్యంత శక్తిమంతమైన నేతగా ఎదిగారు. యూపీఏ-2 ప్రభుత్వ హయాంలో ఆయన కేంద్ర రైల్వే శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించి జాతీయ రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేశారు.

# కదం తొక్కిన డెస్క్ జర్నలిస్టులు

**అందరికీ అక్రెడిటేషన్లు ఇవ్వాలని డిమాండ్**

**ఐఅండ్ పీఆర్ కమిషనరేట్ ఎదుట ధర్నా**

**అన్ని జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద నిరసన**



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): డెస్క్ జర్నలిస్టుల అక్రెడిటేషన్ల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని జర్నలిస్టులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఐ అండ్ పీఆర్ ఆఫీసు ముందు ధర్నా నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఐ అండ్ పీఆర్ అధికారి జగన్‌కు వినతిపత్రం అందించారు. ఈ ధర్నాకు అన్ని జర్నలిస్టు సంఘాలు మద్దతు తెలిపాయి. గతంలో ప్రతి జిల్లాకు ఐదుగురికి, ఎడిషన్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు వచ్చాయని, ఇప్పుడు, కేవలం ఎడిషన్ సెంటర్‌కు నాలుగు అక్రెడిటేషన్లు మాత్రమే ఇస్తామని నిబంధన పెట్టడం దారుణమని జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిబంధనతో చాలామంది డెస్క్ జర్నలిస్టులు అక్రెడిటేషన్ కార్డులకు దూరం అవుతున్నారని తెలిపారు. డెస్క్ జర్నలిస్టులు ఎడిషన్ కేంద్రాల్లోనే పనిచేసినా ఏ జిల్లాకు ఆ జిల్లా డెస్కులు వేరువేరుగా ఉంటాయని, ప్రతి జిల్లాకు ఒక ఇన్చార్జితో పాటు సలుగురు సబ్ ఎడిటర్లు ఉంటారని చెప్పారు. ఒక్కో ఎడిషన్లో మూడు నుంచి ఆరు జిల్లాలున్నాయని వాటికి అనుగుణంగా అక్రెడిటేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో ప్రకారం ఎడిషన్కు నాలుగు కార్డులే ఇస్తే కనీసం ఆ జిల్లాల ఇన్చార్జిలకు కూడా అక్రెడిటేషన్లు వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. హైదరాబాద్ సిటీకి కూడా ఆరు కార్డులే ఇస్తున్నారని, ఇక్కడ కనీసం17 నుంచి 18 మంది పని చేస్తున్నారని చెప్పారు. పైగా ఇప్పుడు హైదరాబాద్ మూడు కమిషరేట్లుగా మారడంతో పేజీలు కూడా పెరుగుతున్నాయన్నారు. దీంతో డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేసే డెస్క్ జర్నలిస్టులకు గూడా అక్రెడిటేషన్లను 12 నుంచి 8కి తగ్గించారని చెప్పారు. వారికి కూడా15 కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, టీయూడబ్ల్యూజే(143) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, కోశాధికారి యోగి, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి గంద్ర నవీన్, డీజేఎఫ్‌టీ జర్నలిస్టులు, హెచ్ యూజే అధ్యక్షుడు అరుణ్ కుమార్, టీ డబ్ల్యూజేఎఫ్ కారదర్శి దామోదర్, టీయూడబ్ల్యూజే హైదరాబాద్ ఇన్చార్జ్ నవీన్ కుమార్ యారా, హెచ్‌యూజే కార్యదర్శి జగదీశ్, డెస్క్ జర్నలిస్టులు విజయ, లలిత, నిస్సార్, దొడ్డి శేఖర్, ఓగోటి కిరణ్ కుమార్, వినోద్ రావు, మనీశ్, శంకర్, భిక్షమయ్య, మధుబాబు, రమేశ్, రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**జిల్లాల్లో జర్నలిస్టుల లేఖాస్త్రాలు**

డెస్క్ జర్నలిస్టులకు కూడా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని అన్ని జిల్లాల్లో జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం జర్నలిస్టులందరినీ ఒకేలా చూడాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల్లోని కలెక్టరేట్ల వద్ద నిరసన తెలిపిన జర్నలిస్టులు.. కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేశారు.

# కుమ్మెర ఘటన అత్యంత హేయం

**ఓయూ ఆర్ట్స్ కాలేజీ**

**ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసీం**

**ఘటనపై ఓయూలో కొవ్వొత్తుల ర్యాలీ**



ఉస్మానియా యూనివర్సిటీ–హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా రెండు నెలల పసిపాప మృతి చెందిన సంఘటనపై అన్ని వర్గాల నుంచి నిరసన వ్యక్తం అవుతోంది. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి జన సమితి అధ్యక్షుడు కడారి రమేశ్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం భారీ ఎత్తున కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ మెయిన్ లైబ్రరీ నుండి విద్యార్థులతో కలిసి బయలుదేరిన ఈ ర్యాలీ ఆర్ట్స్ కాలేజ్ వద్దకు చేరుకుని అక్కడ కొవ్వొత్తుల ప్రదర్శనతో పాటు చిన్నారికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఖాసీం పాల్గొని మాట్లాడారు. 'కుమ్మెర గ్రామంలో జరిగిన ఈ సంఘటన మానవ సమాజానికే అత్యంత అవమానకరం. ఇది కులాలు, మతాలకు అతీతంగా తీవ్రంగా ఖండించదగినది. ఎస్సీ, ఎస్టీ, బీసీలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం వెంటనే రక్షణ చట్టాలు అమలు చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలి. అప్పుడే ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుంది. ఒక కులంలో కొంతమంది చేసిన ఘటనకు మొత్తం కులాన్ని బాధ్యులను చేయడం సరికాదు' అని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన సొంత జిల్లాలో జరిగిన ఈ ఘటనపై తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తులు ఏ స్థాయిలో ఉన్నా రాజకీయ ప్రలోభాలకు తావు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కడారి రమేశ్ యాదవ్ మాట్లాడుతూ, 'ఆధునిక ప్రపంచంలో కూడా కుల వివక్ష కొనసాగుతుండటం తెలుగు సమాజానికి తలదించుకునే విషయం. ప్రభుత్వం తక్షణం స్పందించి బాధితులకు న్యాయం చేయాలి' అని అన్నారు. కార్యక్రమంలో వీజేఎస్ రాష్ట్ర నాయకులు డప్పు గోపి, చెరుకు శివ, బీసీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్, పొలిటికల్ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు వలిగొండ నరసింహ, డాక్టర్ తల్లా అజయ్ కుమార్, బీసీ విద్యార్థి రాష్ట్ర అధ్యక్షుడు చేరాల వంశీ, నూకల మధు యాదవ్, అశ్వన్, ఎడపల్లి హరీశ్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం సభ్యులు లింగేష్ యాదవ్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు బోనాల నగేశ్, శివ యాదవ్, అరుణ్, మౌనిక, ఆకాంక్ష, రేవతి తదితరులు పాల్గొన్నారు.

## నా పేరుతో సంస్థలు బోగస్: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): తన పేరుతో కొంతమంది సంస్థలను ఏర్పాటు చేసినట్లు వచ్చిన వార్తలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తెలంగాణలో 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' పేరుతో కొన్ని సంస్థలు కార్యకలాపాలు చేపడుతుండటంపై ఆయన స్పందించారు. తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని వెల్లడించారు. అలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించేది లేదని స్పష్టం చేశారు. తన పేరుతో కార్యకలాపాలు నిర్వహించే సంస్థలకు ఎలాంటి గుర్తింపు, అనుమతి లేదనే విషయం అందరూ గుర్తించాలని అన్నారు. ఎవరైనా పనిచేయాలనుకుంటే కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ పరిధిలోనే చేయాలని కేటీఆర్ స్పష్టం చేశారు. తన పేరుతో పలు సంస్థల ద్వారా చేస్తున్న కార్యక్రమాలను నిలిపివేయాలని, తనపై అభిమానం ఉన్నవాళ్లు బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేయాలని సూచించారు.

## కామారెడ్డి ఎమ్మెల్యేకి అస్వస్థత


కామారెడ్డి, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): గత కొన్ని రోజులుగా కామారెడ్డి నియోజకవర్గంలో భూ వివాదానికి సంబంధించిన ఆరోపణలు, వరుస సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయన జ్వరంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం పోలీసులు ఆయనను గృహ నిర్బంధంలో ఉంచిన తరుణంలోనే ఈ అనారోగ్యం కలగడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే అస్వస్థతకు గురయ్యారన్న సమాచారం అందుకున్న వైద్య బృందం ఆయన నివాసానికి చేరుకుని ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. కోలుకోవడానికి మరో రెండు మూడు రోజుల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని వారు సూచించారు. మరోవైపు, డిగ్రీ కళాశాల భూముల వివాదంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తుండటంతో కామారెడ్డిలో ఉద్రిక్తత కొనసాగుతోంది. ఈ క్రమంలోనే తమ నాయకుడి ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు ఆయన నివాసం వద్దకు చేరుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎమ్మెల్యే అస్వస్థతకు గురయ్యారన్న వార్తతో నియోజకవర్గ వ్యాప్తంగా బీజేపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు ఆయన ఇంటి వద్ద పహారాను మరింత కట్టుదిట్టం చేశారు.

**షబ్బీర్ అలీకి వెంకటరమణారెడ్డి ఛాలెంజ్**

డిగ్రీ కళాశాల భూముల వ్యవహారం ఇప్పుడు కామారెడ్డి రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఈ భూముల అంశంలో తనపై వస్తున్న అవినీతి ఆరోపణలను కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తీవ్రంగా ఖండించారు. తాను అవినీతికి పాల్పడినట్లు ఆధారాలతో సహా నిరూపిస్తే, తక్షణమే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీకి బహిరంగ సవాల్ విసిరారు. ఈ వివాదంపై పూర్తి వాస్తవాలను బయటపెట్టాలని కోరుతూ ఆయన సోమవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి, కళాశాల భూములకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన వెంకటరమణారెడ్డి... షబ్బీర్ అలీ తన రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సత్యదూరమైన విషయాలను ప్రచారం చేస్తూ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. డిగ్రీ కళాశాల భూముల వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఇప్పటికే తాము ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేశామని, ప్రభుత్వం నుంచి సమాచారం రాగానే అన్ని విషయాలు బహిర్గతం అవుతాయని స్పష్టం చేశారు.

## ఫేక్ న్యూస్‌పై చర్యలు తీసుకోండి

**డీజీపీకి హరీశ్ రావు ఫిర్యాదు**



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. "పోలీసుల అంతు చూసేదాకా వదలబోము" అంటూ తన పేరిట ఓ ఫేక్ వీడియో క్లిప్ సర్క్యులేట్ అవుతుండటంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో నిందితులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ అండదండలు ఉన్నాయా? అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీని ట్యాగ్ చేస్తూ హరీశ్ రావు సోమవారం ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. "తెలంగాణ డీజీపీ గారూ, పోలీసులను, ప్రజలను రెచ్చగొట్టి, తప్పుదోవ పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగా కొన్ని ఫేక్ న్యూస్ క్లిప్పులను ప్రచారంలోకి వదులుతున్నారు. ఇది నేరుగా సంస్థాగత విశ్వసనీయతపై చేస్తున్న దాడి. ఈ విషయంలో తెలంగాణ పోలీసులు తక్షణమే చర్యలు తీసుకుంటారా? లేదంటే ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ఇలాగే అడ్డుఅదుపు లేకుండా వదిలేస్తారా? ముఖ్యమంత్రి, హోంమంత్రి రేవంత్ రెడ్డి గారి కింద ఈ దుష్ప్రచారం చేస్తున్న వారికి రాజకీయ అండదండలు ఉన్నందువల్లే మీరు ఇలా ఎంపిక చేసుకుని మరీ మౌనంగా ఉంటున్నారా? పోలీసు శాఖ గురించి ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తున్న వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని మేము డిమాండ్ చేస్తున్నాం" అంటూ హరీశ్ రావు ట్వీట్ చేశారు.

# గద్వాల నుంచే జైత్రయాత్ర!

**ప్రతి కార్యక్రమం జిల్లా నుంచే.. నాకు జోగులాంబ సెంటిమెంట్.. అమ్మవారి ఆశీస్సులు ఉంటాయ్.. రైతు సంఘర్షణ సభలో కవిత**

గద్వాల, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): బీఆర్ఎస్ పూర్తిగా ఫెయిల్ అయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన 'రైతు సంఘర్షణ' సభలో ఆమె మాట్లాడుతూ, తనకు జోగులాంబ అమ్మవారు సెంటిమెంట్ అని తెలిపారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఏ కార్యక్రమం మొదలైనా ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లా నుంచి ఎక్కువగా ప్రారంభమయ్యేదని అన్నారు. కానీ భవిష్యత్తులో మనం ఏర్పాటు చేయబోయే పార్టీ మొదలు అన్నీ జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ప్రారంభం చేయాలని నిర్ణయించుకున్నానని అన్నారు. ఇక్కడి నడిగడ్డ ప్రజలు నిజాయతీపరులని, అలాగే ఈ గడ్డపై నుంచి ఏ కార్యక్రమం ప్రారంభించినా జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని భావిస్తున్నానని అన్నారు. పరిశ్రమలకు కరెంట్ ఇస్తున్నారు కానీ కష్టపడి పనిచేసే రైతులకు ఇవ్వడం లేదని విమర్శించారు. జోగులాంబ అమ్మవారి దయతో గద్వాల జిల్లా నుంచే తెలంగాణ జాగృతి జైత్రయాత్ర ప్రారంభమైందని అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీని తాము గెలుచుకున్నామని వెల్లడించారు. కానీ వడ్డేపల్లిలో తాము గెలిచిన తర్వాత తమ వారిని అధికార పార్టీ వారు దగ్గరకు తీసుకున్నారని మండిపడ్డారు. అసలు గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని సవాల్ చేశారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని వారు ఎమ్మెల్యేగా ఉన్నారని మండిపడ్డారు. సమాధానం చెప్పుకుంటే ఎమ్మెల్యే రాజీనామా చేయాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేస్తే ఆ మరుక్షణం తాను ఆ పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. రాజకీయాల్లో నీతి, నిజాయతీ, ధైర్యం ఉండాలని వ్యాఖ్యానించారు. మన ప్రాంతం నుంచే నీళ్లు పోతున్నాయి కానీ మనకు మాత్రం అందడం లేదని అన్నారు. నడిగడ్డ ప్రాంతానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేసిందేమీ లేదని అన్నారు. ప్రభుత్వంలో ఎవరున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చేలా ప్రభుత్వాలతో పని చేయించడం కోసమే కొత్త పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరు ఏమిచ్చినా తీసుకోవాలని, కానీ పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. త్వరలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వస్తున్నాయని, అప్పుడు డబ్బులు ఇచ్చినా తీసుకోవాలని, కానీ మీకోసం కొట్లాడే జాగృతి అభ్యర్థులకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500, తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికలకు ముందు చెప్పిందని గుర్తు చేశారు. కానీ ఈ హామీలు ఇప్పటి వరకు నెరవేర్చలేదని అన్నారు.



# రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు

**అరగంట ముందే పరీక్షా**

**కేంద్రానికి చేరుకోవాలి: బోర్డు**



హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): తెలంగాణ ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు జరగనున్న ఈ పరీక్షల నిర్వహణపై ఇంటర్ బోర్డు సెక్రటరీ, ఐఏఎస్ అధికారి కృష్ణాదిత్య కీలక వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది మొత్తం 9,97,075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాబోతున్నారు. ఇందులో మొదటి సంవత్సరం నుంచి 4,89,126 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,07,949 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,495 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 404 ప్రభుత్వ కళాశాలలు, 221 ఎయిడెడ్ కాలేజీలు, 863 ప్రైవేట్ జూనియర్ కళాశాలలతో పాటు 7 ఇతర విద్యా సంస్థలను సెంటర్లుగా ఎంపిక చేశారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రైవేట్ కాలేజీల్లో అధికంగా సెంటర్లు ఉండగా, మిగిలిన జిల్లాల్లో ఎక్కువగా ప్రభుత్వ కళాశాలలనే ప్రాధాన్యతలోకి తీసుకున్నారు. మాస్ కాపీయింగ్‌కు ఏమాత్రం అవకాశం లేకుండా దాదాపు 30 వేల సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించబోతున్నామని, ప్రతి సెంటర్‌పై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణాదిత్య తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని ఆయన సూచించారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని... కానీ, ఆ ఆందోళన వల్ల విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందని, అందుకే నిర్ణీత సమయానికి హాజరుకావాలని కోరారు. అలాగే మధ్యాహ్నం 12 గంటల వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులను బయటకు పంపమని, పరీక్షా పత్రాలను కూడా అప్పటి వరకు బయటకు తీసుకెళ్లకూడదని చెప్పారు. ఏదైనా అవాంఛనీయ ఘటనలు లేదా మాల్ ప్రాక్టీస్ జరిగితే నిర్ణయం తీసుకోవడానికి ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఇక హాల్ టికెట్ల విషయంలో తలెత్తిన వివాదాలపై కూడా ఆయన స్పష్టతనిచ్చారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా, అందరికీ హాల్ టికెట్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కోర్టుకు వెళ్లిన విద్యార్థులకు కూడా ఇప్పటికే హాల్ టికెట్లు జారీ చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 28,500 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో ఉంటారని, విద్యుత్, రవాణా, పోలీస్ శాఖల సమన్వయంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు కృష్ణాదిత్య వెల్లడించారు.



## బాల్క సుమన్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**నేటి కోర్టు తీర్పుపై ఉత్కంఠ**

మంచిర్యాల, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో వేడి పుట్టిస్తున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్ వ్యవహారం ఇప్పుడు కోర్టు మెట్లెక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే అక్రమ కేసులు బనాయించిందని ఆరోపిస్తూ దాఖలైన బెయిల్ పిటిషన్‌పై సోమవారం కీలక విచారణ జరిగింది. అయితే, ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు పోలీసు యంత్రాంగం గడువు కోరడంతో, న్యాయస్థానం తదుపరి వాదనలను మంగళవారానికి వాయిదా వేసింది. ప్రస్తుతం ఆయన మంచిర్యాల జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా కొనసాగుతున్నారు. మున్సిపల్ ఎన్నికల వేళ క్యాతనపల్లిలో చెలరేగిన రాజకీయ సెగలే ఈ అరెస్టుకు ప్రధాన కారణమయ్యాయి. అక్కడ బీఆర్ఎస్ అభ్యర్థులు స్పష్టమైన మెజారిటీ సాధించినప్పటికీ, చైర్‌పర్సన్ మరియు వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో అధికార పార్టీ ఆటంకాలు సృష్టించిందని సుమన్ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును, పోలీసుల వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేపట్టడంతో ఆయనపై కేసులు నమోదై జైలుకు వెళ్లాల్సి వచ్చింది. సుమన్ అరెస్టును నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఇప్పటికే బంద్ నిర్వహించడంతో రేపు కోర్టు ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## సున్నం చెరువు హద్దులు మారవు

**మాధవరం ఆరోపణలను ఖండించిన హైడ్రా**

మాదాపూర్–హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): మాదాపూర్‌లోని సున్నం చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) సరిహద్దుల్లో ఎలాంటి మార్పులు చేయడం లేదని హైడ్రా స్పష్టం చేసింది. చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను మార్చి అభివృద్ధి పనులు చేపడుతున్నారంటూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. చెరువు అభివృద్ధి పనులను అత్యంత శాస్త్రీయంగా, పారదర్శకంగా చేపడుతున్నామని, ఇందులో ఎవరికీ అనుమానాలు అవసరం లేదని ఒక ప్రకటనలో పేర్కొంది. సున్నం చెరువు ఎఫ్‌టీఎల్‌ను 2014 మే నెలలోనే నిర్ధారించారని, ఆ సరిహద్దుల మేరకే ప్రస్తుతం పనులు చేపడుతున్నామని హైడ్రా వివరించింది. ఈ పనుల్లో పేదలకు అన్యాయం చేయడం గానీ, పెద్దలను కాపాడటం గానీ జరగడం లేదని తేల్చిచెప్పింది. ఒకప్పుడు ఆక్రమణలకు గురై కేవలం 14 ఎకరాలకు కుచించుకుపోయిన ఈ చెరువును, 2014లో ఇరిగేషన్ శాఖ నిర్ధారణ ప్రకారం 31 ఎకరాలకు విస్తరించిన విషయాన్ని గుర్తుచేసింది. ఇరిగేషన్, రెవెన్యూ వంటి సంబంధిత శాఖల సమన్వయంతోనే ఎఫ్‌టీఎల్ నిర్ధారణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని తెలిపింది. సోమవారం సున్నం చెరువును సందర్శించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు, అక్కడే ఉన్న ఇరిగేషన్ అధికారులు వాస్తవాలను వివరించారని హైడ్రా పేర్కొంది. 2014లో ఇరిగేషన్ శాఖ నిర్ణయించిన జియో కో-ఆర్డినేట్స్ (అక్షాంశాలు, రేఖాంశాలు) ప్రకారమే ఎఫ్‌టీఎల్ సరిహద్దులను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని స్పష్టం చేసింది.

## పవన్ కల్యాణ్..ఛలో తెలంగాణ

**పార్టీ బలోపేతానికి సభ్యత్వాలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణలో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జనసేన తెలంగాణ విభాగం ప్రకటన విడుదల చేసింది. సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. జనసేన పార్టీ 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో పార్టీని 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో బలంగా తీసుకెళ్లి, సంస్థాగతంగా బలోపేతం చేయడానికి జిల్లాలవారీగా కొంతమంది నాయకులకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలను అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నూతనంగా ఏర్పడిన మూడు కార్పొరేషన్‌లకు వేర్వేరు ఇన్‌ఛార్జులను నియమించారు. జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ నాయకులు రాధారాం రాజలింగం, కావ్య మండపాక, శిరీష పొన్నూరి రాష్ట్రస్థాయిలో పర్యవేక్షిస్తారని ఆ ప్రకటనలో జనసేన పార్టీ తెలిపింది.

**NAME CHANGE**

I, VANITHA VURADI, D/o. Vuradi Sathaiah, w/o. SRIPATHI LAXMI-NARAYANA, R/o. H.no. 9-7, near Sangam Chowrasta, village and mandal: Kothapally Haveli, Dist: Karimnagar, PIN:505451, have changed my name from SRIPATHI VANITHA to VANITHA VURADI D/o Vuradi Sathaiah w/o. Sripathi Laxminarayana for all purposes

## కులాంతర వివాహం.. కుల బహిష్కరణ!




జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాకు చెందిన పసుల సంగీత(ఎస్సీ), బద్దీ పవన్(ఎస్టీ) 2023లో ప్రేమ వివాహం చేసుకోగా, అబ్బాయి తరపు కుల పెద్దలు వారిని కుల బహిష్కరణ చేశారు. ఊరిలో ఏ శుభకార్యాలకు రానివ్వకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు. గతంలో ఫిర్యాదు చేసినా స్పందన లేదని, తమకు సామాజిక గౌరవం దక్కేలా చూడాలని కోరారు. ఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని వేడుకున్నారు.

## జగిత్యాలలో కుండపోత

### రాలిన మామిడి పిందెలు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో ఇబ్బందిపెట్టిన వాతావరణం.. సాయంత్రానికి ఒక్కసారిగా చల్లబడింది. ముందుగా ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి, రాత్రి సమయంలో కుండపోతగా వర్షం పడింది. అకాల వర్షంతో రహదారులు నిండిపోయాయి. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం కలిగినట్లు తెలిసింది. అటు.. మామిడి తోటలలో పిందెలు రాలిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉష్ణోగ్రతల మార్పులతో ఇబ్బంది పడుతున్న రైతులకు ఈ అకాల వర్షం మరింత నష్టాన్ని కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.



## దూసుకెళ్లిన మార్కెట్లు

ముంబై: భారత స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా లాభాల బాటలో పయనించాయి. సోమవారం నాటి ట్రేడింగ్‌లో పీఎస్‌యూ బ్యాంకింగ్, హెల్త్‌కేర్ రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు సానుకూలంగా ముగిశాయి. అమెరికా సుప్రీంకోర్టు సుంకాలపై ఇచ్చిన తీర్పుతో అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు రావడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌కు బలాన్నిచ్చింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 479.95 పాయింట్లు పెరిగి 83,294.66 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, నిఫ్టీ 141.75 పాయింట్లు లాభపడి 25,713 వద్ద ముగిసింది. సెన్సెక్స్ స్టాక్స్‌లో అదానీ పోర్ట్స్ 2.82 శాతం లాభంతో టాప్ గెయినర్‌గా నిలిచింది. కోటక్ మహీంద్రా బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్ గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా లాభపడ్డాయి. మరోవైపు, టెక్నాలజీ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రధాన నష్టాల్లో ఉన్నాయి. వీటితో పాటు ట్రెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐటీసీ లిమిటెడ్ షేర్లు కూడా నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 1.36 శాతం, నిఫ్టీ మిడ్‌స్మాల్ హెల్త్‌కేర్ ఇండెక్స్ 1.03 శాతం మేర పెరిగాయి. అయితే, నిఫ్టీ ఐటీ సూచీ నష్టాలతో ముగిసింది. బ్రాడర్ మార్కెట్లలో మిశ్రమ ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.43 శాతం క్షీణించగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.29 శాతం లాభంతో ముగిసింది.

## లంచగొండి పోలీసులు

### అడ్డంగా దొరికిపోయిన ఇద్దరు ఖాకీలు

కడప, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దూకుడు పెంచారు. లంచం తీసుకుంటున్న పోలీస్ అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో ఏకంగా పోలీస్ స్టేషన్‌లోనే రూ.3 లక్షలు లంచం తీసుకుంటున్న ఇద్దరు పోలీసు అధికారులను సోమవారం అరెస్ట్ చేయడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే, పులివెందుల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) ఎన్.వి. రమణ, సింహాద్రిపురం సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) దాసరి అనిల్ కుమార్.. చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడిగా ఉన్న ఒక వ్యక్తి నుంచి రూ.4 లక్షలు లంచం డిమాండ్ చేశారు. దొంగిలించిన బైకులతో నేరాలకు పాల్పడుతున్న ఈ కేసులో అనుకూలంగా వ్యవహరిస్తామని వారు హామీ ఇచ్చారు. దీంతో బాధితుడు మొదట కొంత మొత్తం చెల్లించాడు. మిగిలిన డబ్బు కోసం పోలీసులు ఒత్తిడి చేయడంతో, అతను ఏసీబీని ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో పక్కా ప్రణాళికతో వల పన్నారు. బాధితుడు రూ.3 లక్షలను ఎస్ఐ అనిల్ కుమార్‌కు అందజేస్తుండగా, అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న సీఐ రమణను కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఇదే తరహాలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడి నుంచి రూ.10,000 లంచం తీసుకుంటున్న మండల విద్యాధికారి (ఎంఈఓ) కుర్మాన అప్పారావు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉప్పాడ కామేశ్వరరావును ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మరో ఘటనలో, విజయనగరం జిల్లా భోగాపురం మండలం సవరవిల్లి గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్ఓ) ఆర్. చిట్టిబాబు కూడా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. అవినీతి అధికారులను పట్టుకోవడానికి సమాచార వ్యవస్థను బలోపేతం చేస్తామని ఏసీబీ డీజీ అతుల్ సింగ్ గత నెలలో చేసిన ప్రకటనకు అనుగుణంగా ఈ దాడులు జరగడం గమనార్హం.

## లోకేశ్ ఆదేశాలతో నా ఇంటిపై బీభత్సం: అంబటి



రాజమండ్రి, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి బెయిల్ పై విడుదలైన మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు అధికార కూటమి ప్రభుత్వంపై విమర్శల దాడిని ఉధృతం చేశారు. తన నివాసంపై జరిగిన దాడి వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఉన్నారని ఆయన ఘాటుగా ఆరోపించారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆయన... తాను జైలులో ఉన్న సమయంలో తన కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేసేలా దాడులు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం ఐదు గంటల నుంచి అర్ధరాత్రి పన్నెండు గంటల వరకు తన ఇంటిపై దాడి జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని, ఇది ముందస్తు ప్రణాళికతో జరిగిన కుట్ర కాదా? అని నిలదీశారు. లోకేశ్ ఆదేశాలతోనే తన ఇంటిపై దాడి జరిగిందని ఆరోపించారు. తమ ఇంట్లోని మహిళలు ప్రాణభయంతో వెనుక గేటు నుంచి బయటకు వెళ్లాల్సిన దుస్థితి కల్పించారని అంబటి పేర్కొన్నారు. సాధారణంగా ఆవేశంలో దాడులు జరగడం చూస్తుంటామని, కానీ ఏకంగా ఏడు గంటల పాటు పోలీసులు నిర్వీర్యంగా ఉండిపోయారంటే దాని వెనుక ఉన్నది పైస్థాయి ఆదేశాలేనని ఆయన స్పష్టం చేశారు. తన ఆఫీసును, ఇంటిని తగలబెట్టాలనే లక్ష్యంతోనే ఈ అల్లర్లను ప్రోత్సహించారని ఆరోపించారు. మాజీ మంత్రి హోదాలో ఉన్న తన ఇంటికే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. ఈ కష్టకాలంలో తనకు మద్దతుగా నిలిచిన వైసీపీ నాయకులు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తాను జైలులో ఉన్నప్పుడు పార్టీ అధినేత జగన్ తన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు భరోసా ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. 18 రోజుల జైలు జీవితం తర్వాత వాస్తవాలను ప్రజల ముందు ఉంచడానికే ఈ మీడియా సమావేశం ఏర్పాటు చేశానని, ప్రభుత్వ వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని అంబటి రాంబాబు స్పష్టం చేశారు.

## నా భార్యను అన్యాయంగా ఇరికించారు: అనంతబాబు

విజయవాడ, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు మరోసారి గళమెత్తారు. తన భార్య లక్ష్మీదుర్గను ఈ కేసులోకి అన్యాయంగా లాగారని, ఆమెను నిందితురాలిగా (ఏ2) చేర్చడం రాజకీయ కక్షసాధింపేనని ఆయన మండిపడ్డారు. తాను పరారీలో లేనని, కేవలం వ్యక్తిగత పనులతో బిజీగా ఉన్నానని, తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. పోలీసుల నుంచి తనకు ఇప్పటి వరకు ఎలాంటి నోటీసులు అందలేదని, ఒకవేళ నోటీసులు ఇస్తే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన చెప్పారు. ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టు తన డిఫాల్ట్ బెయిల్‌ను శాశ్వతం చేసిందని గుర్తు చేస్తూ... ప్రస్తుత కూటమి ప్రభుత్వం తనను, తన కుటుంబాన్ని కావాలనే లక్ష్యంగా చేసుకుందని అనంతబాబు ఆరోపించారు. తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ అంశం వంటి కీలక విషయాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే తన కేసును మళ్లీ హైలైట్ చేస్తున్నారని ఆయన విమర్శించారు. వైసీపీలో చురుగ్గా ఉన్నవారిని వేధించడమే ధ్యేయంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని, హైకోర్టులో తాను సవాలు చేసిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోవద్దని స్పష్టమైన ఆదేశాలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, గతంలో పోలీసులు తనకు సహకరించారన్న వార్తల్లో ఎంతమాత్రం నిజం లేదని ఆయన అన్నారు. పోలీసుల సహకారం ఉంటే ఏడు నెలల పాటు జైలులో ఉండాల్సిన అవసరం వచ్చేది కాదని, చట్టం తన పని తాను చేసుకుపోయిందని వెల్లడించారు. ఈ కేసును కులం లేదా రాజకీయ పార్టీతో ముడిపెట్టవద్దని, దీన్ని పూర్తిగా తన వ్యక్తిగత అంశంగా మాత్రమే చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బీసీ రిజర్వేషన్లు 34 శాతం చేస్తాం

### స్థానిక ఎన్నికలలోపు అమలు చేస్తాం.. చట్టం కోసం కేబినెట్ సబ్ కమిటీ.. ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడి



అమరావతి, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): ఏపీలో సామాజిక సమానత్వం సాధించడం కోసమే కూటమి ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తోందని ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజల్లో ఆర్థిక అసమానతలు తగ్గించి, జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆయన ఉద్ఘాటించారు. సోమవారం నాడు శాసనసభలో బడ్జెట్‌లోని సంక్షేమ శాఖల కేటాయింపులపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ, 'సూపర్ సిక్స్' హామీలను 'సూపర్ హిట్' చేసి చూపించామని, ఇది ఎన్డీయే ప్రభుత్వ ఘనత అని అన్నారు. ఆటో డ్రైవర్లు, మత్స్యకారులు, చేనేత కార్మికుల వంటి అన్ని వర్గాలకు అదనపు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని వివరించారు. బీసీల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. "గత ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించింది. ఆ రిజర్వేషన్లను తిరిగి 34 శాతానికి పెంచేందుకు వన్ మ్యాన్ కమిషన్‌ను ఏర్పాటు చేశాం. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేలోపే రిజర్వేషన్లు పెంచి అమలు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. బీసీల రక్షణ కోసం ఒక ప్రత్యేక చట్టం తీసుకురావడానికి కేబినెట్ సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేశాం" అని సభకు హామీ ఇచ్చారు. బీసీల్లోని కొన్ని వర్గాలను ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలన్న డిమాండ్లపై ఇప్పటికే కేంద్రానికి బిల్లులు పంపామని, వాటిని ఫాలోఅప్ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు గతంలో కంటే అధికంగా నిధులు కేటాయించామని ముఖ్యమంత్రి తెలిపారు. "ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం. ఇందులో కేటాయించిన నిధులను ఆయా వర్గాలకే ఖర్చు చేసేలా చిత్తశుద్ధితో పనిచేస్తాం. కేవలం సంక్షేమ పథకాలు ఇవ్వడమే కాకుండా, ప్రతి వర్గాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకే ఈ కేటాయింపులు జరిపాం. ప్రజల ఆదాయాలు పెంచి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే మా లక్ష్యం. 'స్వర్ణాంధ్ర విజన్ 2047'లో భాగంగా, ప్రస్తుతం రూ.3 లక్షలుగా ఉన్న రాష్ట్ర తలసరి ఆదాయాన్ని 2047 నాటికి రూ.54 లక్షలకు పెంచే నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం" అని చంద్రబాబు అన్నారు. చౌక దుకాణాల ద్వారా సరుకుల పంపిణీలో టెక్నాలజీని ఉపయోగించి పారదర్శకతను పెంచుతున్నామని ఆయన వెల్లడించారు. గతంలో పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంతో రోడ్లు, విమానాశ్రయాలు వంటి మౌలిక వసతులు కల్పించి సంపద సృష్టించినా, ఆర్థిక అసమానతలు తగ్గలేదని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ తారతమ్యాలను రూపుమాపేందుకే 'పీ4' (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్-పార్టనర్‌షిప్) అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. "మా దృష్టి అంతా భావితరాలపైనే ఉంది. అంగన్‌వాడీల నుంచి రెసిడెన్షియల్ పాఠశాలల వరకు విద్యావ్యవస్థను బలోపేతం చేస్తున్నాం. ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవడానికి 'పీ4' కంటే మెరుగైన కార్యక్రమం ఉండదు. ఈ విధానంలో భాగంగా 10 లక్షల బంగారు కుటుంబాలను లక్ష మంది మార్గదర్శకులు దత్తత తీసుకుని వారిని ముందుకు నడిపిస్తారు. 2047 నాటికి భారతదేశం 'వికసిత్ భారత్'గా రూపాంతరం చెందేసరికి రాష్ట్రంలో అసమానతలు ఉండకూడదన్నదే మా సంకల్పం" అని ఆయన వివరించారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే 1996-97లో తొలిసారి ఎస్సీ వర్గీకరణ చేసి సామాజిక న్యాయం చేశామని, కానీ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దాన్ని కాపాడలేకపోయాయని చంద్రబాబు గుర్తుచేశారు. గిరిజనుల కోసం తీసుకొచ్చిన జీవో నంబర్ 3ని కూడా గత పాలకులు నిర్వీర్యం చేయడంతో సుప్రీంకోర్టు దాన్ని కొట్టివేసిందని అన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో జీవో 3పై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని, దీనిపై ఇప్పటికే ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్నామని వెల్లడించారు. మైనారిటీలకు రక్షణ కల్పించడంతో పాటు మౌజన్‌లు, ఇమామ్‌లకు గౌరవ వేతనం అందిస్తున్నామని తెలిపారు. మహిళల సాధికారతకు ఎన్టీఆర్ హయాం నుంచే ప్రాధాన్యత ఇస్తున్నామని, అగ్రవర్ణాల్లోని పేదలను కూడా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. త్వరలో కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని 'ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు' అందిస్తామని, 'సంజీవని' పథకం ద్వారా పేదలకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తామని ప్రకటించారు. ఇది బలహీన వర్గాల ప్రభుత్వమని, వారిని బలోపేతం చేయాలని అన్ని శాఖలకు పిలుపునిచ్చారు.

# కల్తీ పాలతో నలుగురి మృతి

### రాజమండ్రిలో తీవ్ర విషాదం.. ఘటనపై జగన్ తీవ్ర దిగ్భ్రాంతి.. ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ



రాజమండ్రి, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): రాజమండ్రిలో కల్తీ పాలు సేవించి నలుగురు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ సంఘటనపై మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపిన ఆయన, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆహార భద్రత అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లిందని జగన్ ఆరోపించారు. ఈ దారుణానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి విషాదాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో ఇవి పునరావృతం కాకుండా తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు. బాధితులందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్య శాఖ వెంటనే రంగంలోకి దిగాలని, అవసరమైతే నిపుణులైన వైద్య బృందాలను పంపాలని జగన్ కోరారు. ఆహార భద్రత తనిఖీలను కట్టుదిట్టం చేసి, పాల వంటి నిత్యావసరాలపై ప్రజలకు నమ్మకం కలిగించాలని విజ్ఞప్తి చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి నగరంలోని లాలా చెరువు, చౌడేశ్వరి నగర్ ప్రాంతాల్లో గత రెండు రోజులుగా నలుగురు మరణించారు. మూత్రం రాకపోవడం (అనూరియా) లక్షణాలతో వీరు మృతి చెందగా, దీనికి కల్తీ పాలే కారణమని అనుమానిస్తున్నారు. ఆదివారం రాత్రి ఎస్. శేషగిరిరావు (72), రాధా కృష్ణమూర్తి (74) మరణించారు. అంతకుముందు మరో ఇద్దరు చనిపోయారు. ఈ నెల 15 నుంచి సుమారు 14 మంది అనారోగ్యంతో వివిధ ఆసుపత్రుల్లో చేరారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నారు. బాధితులంతా ఒకే పాల వ్యాపారి వద్ద పాలు కొనుగోలు చేయడంతో కల్తీ జరిగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

## జైళ్ల సంస్కరణలకు ఏపీ ఆమోదం

అమరావతి, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జైళ్లలో మగ్గుతున్న ఖైదీల జీవితాల్లో వెలుగులు నింపే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈరోజు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల 8వ రోజున రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత 'జైళ్లు, సంస్కరణల చట్టం సవరణ బిల్లు'ను ప్రవేశపెట్టగా, సభ దీనికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి అనిత, జైళ్లను కేవలం శిక్షా కేంద్రాలుగా కాకుండా సంస్కరణాలయాలుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాభిక్ష కల్పించే విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, కేంద్రం నిర్దేశించిన చట్టాలకు అనుగుణంగా రాష్ట్రంలోనూ సంస్కరణలు అమలు చేస్తామని ఆమె ప్రకటించారు. జైలు గోడల మధ్య కూడా మానవీయ విలువలు కాపాడాలన్న ఉద్దేశంతో మహిళా ఖైదీల పిల్లల కోసం ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. ఖైదీల నేరచరిత్ర, ప్రవర్తన ఆధారంగా వారిని కేటగిరీలుగా విభజించి, వారిలో మానసిక పరివర్తన తెచ్చేందుకు 'ఓపెన్ ఎయిర్ జైళ్ల'ను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. ఖైదీలు జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా వ్యవసాయం మరియు ఇతర వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇస్తామని, వారు చదువుకునేందుకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ బిల్లుపై జరిగిన చర్చలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. జైళ్లలో సిబ్బంది కొరత, ముఖ్యంగా మహిళా సిబ్బంది లేకపోవడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన సభ దృష్టికి తెచ్చారు. 60 ఏళ్లు దాటిన వృద్ధ ఖైదీలకు, చిన్న చిన్న కేసుల్లో ఇరుక్కున్న వారికి సత్ప్రవర్తన ప్రాతిపదికన క్షమాభిక్ష ప్రసాదించాలని ఆయన కోరారు. గత ప్రభుత్వ హయాంలో తాము కూడా జైలు అనుభవాలను చూశామని గుర్తు చేసుకుంటూ, ఖైదీలు విడుదలయ్యాక జనజీవన స్రవంతిలో కలిసేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ వివరణ అనంతరం బిల్లు ఆమోదం పొందడంతో, త్వరలోనే వందలాది మంది ఖైదీల విముక్తికి మార్గం సుగమం కానుంది.

## తిరుమలలో పాము కలకలం

తిరుమల, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): తిరుమల దర్శన క్యూలైన్‌లో ఓ మహిళా భక్తురాలిని పాము కాటు వేసిందంటూ మీడియా, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఖండించింది. ఈ వార్తలు పూర్తిగా అవాస్తవమని, భక్తులు ఆందోళన చెందవద్దని స్పష్టం చేసింది. అసలు ఘటనపై టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి పూర్తి వివరాలు వెల్లడించారు. టీటీడీ కథనం ప్రకారం, తెలంగాణలోని వరంగల్‌కు చెందిన శరత్ బాబు, మౌనిక దంపతులు ఆదివారం రాత్రి శ్రీవారి దర్శనానికి తిరుమల వచ్చారు. మ్యూజియం సమీపంలోని ఆర్.బి. సెంటర్ పార్కింగ్ ఏరియాలో కారు దిగిన తర్వాత, మౌనిక పసుపు రాసుకునేందుకు పక్కనే ఉన్న చీకటి ప్రదేశంలోకి వెళ్లారు. ఆ సమయంలో కాలికి ఏదో తగలడంతో పాము అని భయపడ్డారు. ఆమె భర్త పరిశీలించగా అక్కడో చిన్న పాము కనిపించింది. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆమెను తిరుమలలోని అశ్విని ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఎలాంటి పాముకాటు జరగలేదని నిర్ధారించారు. అయినప్పటికీ, మరింత భరోసా కోసం ఆమెను తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి పంపించారు. అక్కడి వైద్యులు కూడా ఎలాంటి ఆరోగ్య సమస్య లేదని స్పష్టం చేశారు. ఆ పాము కూడా విషపూరితం కాదని విచారణలో తెలిసింది. ఈ ఘటన తర్వాత సోమవారం ఉదయం ఆ దంపతులు క్షేమంగా శ్రీవారిని దర్శించుకున్నారు. తమకు వెంటనే సహాయం అందించిన టీటీడీ సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు తమ భద్రత దృష్ట్యా నిర్దేశించిన క్యూలైన్లు, మార్గాల్లోనే ప్రయాణించాలని, అటవీ ప్రాంతాల్లోకి వెళ్లవద్దని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

## అంబటి ఇంటికి ముద్రగడ

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఈవార్తలు): వైసీపీ సీనియర్ నేత, కాపు ఉద్యమ ప్రముఖుడు ముద్రగడ పద్మనాభం ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇటీవల గుంటూరులో దాడికి గురైన మాజీ మంత్రి అంబటి రాంబాబు నివాసాన్ని ఆయన సోమవారం సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ.. కూటమి పాలనలో వైసీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని ఆరోపించారు. అంబటి ఇంటిపై దాడి బాధాకరమని, ఇళ్లపై దాడులు చేసే సంస్కృతి మంచిది కాదని హితవు పలికారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా, బాధితుడైన అంబటినే జైల్లో పెడతారా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ పర్యటనలో అంబటి కుమార్తె మౌనికను ప్రత్యేకంగా అభినందించిన ముద్రగడ, ఆమెను 'ఫైర్‌బ్రాండ్' అని అభివర్ణించారు. భవిష్యత్తులో ఆమె పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం చంద్రబాబుపై ముద్రగడ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కాపుల ఓట్లతో రెండుసార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక మళ్లీ కాపులనే వేధిస్తున్నారు. నాడు నన్ను, నా కుటుంబాన్ని తీవ్రంగా అవమానించారు, ఇప్పుడు అంబటిని టార్గెట్ చేశారు. మాకు జరిగిన అవమానాలు మీ కుటుంబ సభ్యులైన భార్య, కొడుకు, కోడలికి జరిగితే ఎలా ఉంటుందో ఆలోచించండి" అని చంద్రబాబును ఉద్దేశించి ప్రశ్నించారు. కాపులు బానిసలు కాదని, తమను అవమానించడం ఆపాలని స్పష్టం చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలోనూ కూటమి ప్రభుత్వం రోజూ అబద్ధాలు ఆడుతోందని ముద్రగడ విమర్శించారు. "ఇకనైనా అబద్ధాలు ఆపి శ్రీవారికి క్షమాపణ చెప్పండి లేదా కనీసం లడ్డూ గురించి మాట్లాడటం మానేయండి" అని సూచించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కక్ష సాధింపు చర్యలు, ఇళ్లపై దాడులకు స్వస్తి పలకాలని ప్రభుత్వానికి హితవు పలికారు. లేదంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ముద్రగడ వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకున్నట్లయింది.



## స్టాలిన్‌లో ఓటమి భయం

### అందుకే బీజేపీతో పొత్తుకు తహతహ

### టీవీకే చీఫ్ విజయ్ ఆరోపణలు

చెన్నై: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతో బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని స్టాలిన్ ప్రభుత్వం చూస్తోందని ప్రముఖ సినీ నటుడు, టీవీకే అధినేత విజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పరిస్థితులకు అనుగుణంగా మారిపోవడం ఆ పార్టీ నేతలకు అలవాటేనని వ్యాఖ్యానించారు. వేలూరులో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో తనను ఎలాగైనా ఓడించాలనే ఆలోచనతో స్టాలిన్ కుట్రలు పన్నుతున్నారని అన్నారు. డీఎంకేకు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనని అన్నారు. ప్రభుత్వాల అవినీతిని ప్రశ్నిస్తున్నందువల్లే తనను లక్ష్యంగా చేసుకుంటున్నారని విజయ్ అన్నారు. తమ పార్టీ నిర్వహించే బహిరంగ సభలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు. అందువల్లే తాను అన్ని ప్రాంతాల ప్రజలను కలవలేకపోతున్నానని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి టీవీకే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామాన్ని సందర్శిస్తానని హామీ ఇచ్చారు. తనను ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా వెనక్కి తగ్గేది లేదని అన్నారు. అవినీతిని ప్రశ్నించడం ఆపేది లేదని స్పష్టం చేశారు.

# ఆపరేషన్ త్రాషి-1 విజయవంతం

## పాక్ ఉగ్రవాదుల కోసం 326 రోజుల వేట.. ఏడుగురు జైషే టెర్రరిస్టుల హతం

న్యూఢిల్లీ: భారత భద్రతా దళాలు జమ్మూ కశ్మీర్‌లోని కిష్టవాడ్ జిల్లాలో సాధించిన ఓ అద్భుతమైన విజయం ఇది. దాదాపు 326 రోజుల పాటు అలుపెరగకుండా సాగించిన 'ఆపరేషన్ త్రాషి-1' విజయవంతంగా ముగిసింది. ఈ సుదీర్ఘ ఆపరేషన్‌లో పాకిస్థాన్ ప్రేరేపిత జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన ఏడుగురు కరడుగట్టిన టెర్రరిస్టులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. ఈ విజయంతో జమ్మూ ప్రాంతంలో ఉగ్రవాదాన్ని పునరుద్ధరించాలన్న కుట్రకు గట్టి దెబ్బ తగిలినట్లయింది. కిష్టవాడ్ జిల్లాలోని ఛత్రూ అటవీ ప్రాంతంలోని అత్యంత కఠినమైన పర్వతాలు, దట్టమైన అడవులు ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారాయి. సరైన రహదారి సౌకర్యం కూడా లేని ఈ ప్రాంతంలో దాక్కున్న ఉగ్రవాదులను ఏరివేసేందుకు భారత సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీస్, సీఆర్‌పీఎఫ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. భారీ వర్షాలు, గడ్డకట్టే చలి, మంచు వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులను సైతం లెక్కచేయకుండా, భద్రతా సిబ్బంది దాదాపు ఏడాది పాటు ఇదే ప్రాంతంలో మోహరించి పోరాటం సాగించారు. ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యం జైషే మహమ్మద్ కమాండర్ సైఫుల్లా సహా ఏడుగురు ఉగ్రవాదుల ఏరివేత. దాదాపు ఐదేళ్ల క్రితం కశ్మీర్‌లోకి చొరబడిన సైఫుల్లా, ఈ ప్రాంతంలో ఉగ్రవాదాన్ని మళ్లీ పునరుద్ధరించాలని ప్రయత్నిస్తున్నాడు. ఒకప్పుడు హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది బుర్హాన్ వనీ తరహాలో, ఇతడు కూడా యువతను ఆకర్షించేందుకు పోస్టర్ బాయ్‌గా మారే ప్రయత్నం చేశాడు. ఈ మొత్తం ఆపరేషన్ పలు దశల్లో జరిగింది. 2025 ఏప్రిల్-మే నెలల్లో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. అనంతరం, ఈ ఏడాది జనవరి 14న 'ఆపరేషన్ త్రాషి-1' పేరుతో తుది దశ ఆపరేషన్‌ను ప్రారంభించారు. ఈ క్రమంలో జనవరి 18న జరిగిన ఎన్‌కౌంటర్‌లో స్పెషల్ ఫోర్సెస్‌కు చెందిన హవల్దార్ గజేంద్ర సింగ్ వీరమరణం పొందారు. ఫిబ్రవరి 4న మరో ఉగ్రవాది ఆదిల్‌ను హతమార్చారు. చివరగా, ఫిబ్రవరి 22న ఛత్రూ సమీపంలోని పస్సెర్‌కుట్ ప్రాంతంలో ఓ మట్టి గుహలో దాక్కున్న సైఫుల్లా సహా చివరి ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు చుట్టుముట్టి మట్టుబెట్టాయి. ఈ విజయం వెనుక భద్రతా దళాల మధ్య అద్భుతమైన సమన్వయం ఉంది. సైన్యంలోని వైట్ నైట్ కార్ప్స్, జమ్మూ కశ్మీర్ పోలీసుల స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్, సీఆర్‌పీఎఫ్ దళాలు కలిసికట్టుగా పనిచేశాయి. స్థానిక ప్రజల నుంచి అందిన సమాచారం, కచ్చితమైన మిలిటరీ ఇంటెలిజెన్స్ ఈ




ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించాయి. అత్యాధునిక ఎఫ్‌పీవీ డ్రోన్లు, యూఏవీలు, శాటిలైట్ ఇమేజరీ వంటి టెక్నాలజీని ఉపయోగించి ఉగ్రవాదుల కదలికలను పసిగట్టారు. ఫిబ్రవరి 22న జరిగిన చివరి దాడిలో, ఉగ్రవాదులు ఉన్న గుహలోకి పంపిన 'టైసన్' అనే ఆర్మీ డాగ్ గాయపడింది. దాన్ని వెంటనే చికిత్స కోసం ఎయిర్‌లిఫ్ట్ చేశారు. ఎన్‌కౌంటర్ స్థలం నుంచి ఏకే-47, ఎం4 కార్బైన్ రైఫిళ్లతో పాటు భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌తో ఛత్రూ ప్రాంతాన్ని ఉగ్రవాద రహితంగా మార్చామని సైన్యం ప్రకటించింది. "ఉగ్రవాద నెట్‌వర్క్‌కు ఇది భారీ దెబ్బ. మా దళాల సంకల్పం, ధైర్యసాహసాల ముందు ఏ శక్తీ నిలబడలేదని ఇది నిరూపిస్తోంది. మేము సేవ చేస్తాం, మేము రక్షిస్తాం" అని వైట్ నైట్ కార్ప్స్ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. ఈ విజయంతో కిష్టవాడ్-దోడా ప్రాంతంలో శాంతిని నెలకొల్పే దిశగా భద్రతా దళాలు కీలక ముందడుగు వేశాయి.

# వాట్సాప్.. జీ హుజూర్!

**డేటా షేరింగ్‌పై దిగొచ్చిన మెసేజింగ్ యాప్**

**సుప్రీంకోర్టులో కీలక హామీ**



న్యూఢిల్లీ: యూజర్ల డేటా గోప్యత విషయంలో మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇతర మెటా కంపెనీలతో తమ డేటాను పంచుకునే విషయంలో యూజర్లకు మరింత నియంత్రణ కల్పించాలన్న కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆదేశాలకు కట్టుబడి ఉంటామని సోమవారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఈ మేరకు కోర్టుకు హామీ ఇవ్వడంతో, సీసీఐ జరిమానాను సవాలు చేస్తూ దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్లను వాట్సాప్, దాని మాతృసంస్థ మెటా వెనక్కి తీసుకున్నాయి. సోమవారం ఈ కేసు విచారణ సందర్భంగా వాట్సాప్, మెటా తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. "మేము ఇప్పుడు స్టే కోరడం లేదు. ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటున్నాం" అని ఆయన కోర్టుకు తెలిపారు. నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) జారీ చేసిన ఆదేశాలను మార్చి 16 నాటికి అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ వాదనలను నమోదు చేసుకున్న ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, మధ్యంతర పిటిషన్లను కొట్టివేసింది. వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీ ద్వారా యూజర్లపై అన్యాయమైన షరతులు విధిస్తోందని, తద్వారా మెటా తన మార్కెట్ ఆధిపత్యాన్ని బలోపేతం చేసుకుంటోందని సీసీఐ గతంలో నిర్ధారించింది. ఈ నిర్ణయాన్ని ఎన్‌సీఎల్ఏటీ సమర్థించింది. అయితే, యూజర్లకు డేటా షేరింగ్‌పై స్పష్టమైన ఆప్ట్-ఇన్, ఆప్ట్-అవుట్ సౌకర్యాలు కల్పిస్తే సరిపోతుందని, పూర్తిస్థాయి నిషేధం అవసరం లేదని సూచించింది. ఈ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు గతంలో వాట్సాప్ ప్రైవసీ పాలసీపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇది "అంగీకరించు లేదా వైదొలగు" పద్ధతిలో ఉందని, భారతీయ యూజర్ల గోప్యతా హక్కుతో ఆడుకోవడానికి వీల్లేదని ఘాటుగా వ్యాఖ్యానించింది. ప్రస్తుతం వాట్సాప్ మధ్యంతర పిటిషన్లను ఉపసంహరించుకున్నప్పటికీ, 2021 ప్రైవసీ పాలసీ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన ప్రధాన అప్పీల్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లోనే ఉంది.

# అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఆటోమేటిక్ రీఫండ్

**31 లక్షలకు పైగా ఖాతాల్లో రూ.10,903 కోట్ల నిల్వలు**

**ఆధార్ లింక్ అయిన బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ**





న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఖాతాల్లో చాలాకాలంగా క్లెయిమ్ చేయకుండా ఉన్న డిపాజిట్లను తిరిగి చందాదారులకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఎలాంటి క్లెయిమ్ ఫారాలు లేకుండానే, ఈ సొమ్మును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయనున్నారు. ఈ నిర్ణయం వల్ల సుమారు 31 లక్షల మందికి పైగా ఖాతాదారులకు ప్రయోజనం చేకూరనుంది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈపీఎఫ్ఓ వద్ద ప్రస్తుతం 31.86 లక్షల ఖాతాలు నిరుపయోగంగా (ఇన్‌ఆపరేటివ్) ఉన్నాయని, వాటిలో మొత్తం రూ.10,903 కోట్లు ఉన్నాయని అధికారులు గుర్తించారు. మూడేళ్లకు పైగా ఎలాంటి లావాదేవీలు జరగని ఖాతాలను నిరుపయోగంగా పరిగణిస్తారు. వీటిలో కొన్ని ఖాతాలు 20 ఏళ్లకు పైబడినవి కూడా ఉన్నాయి. ఈ కొత్త విధానాన్ని అమలు చేయడానికి త్వరలోనే పైలట్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. తొలి దశలో భాగంగా, 7.11 లక్షల ఖాతాదారులకు ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ముఖ్యంగా రూ.1,000 లోపు మొత్తాలు ఉన్న ఖాతాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈపీఎఫ్ఓ వద్ద ఉన్న ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతా వివరాల ఆధారంగా ఈ మొత్తాన్ని ఆటోమేటిక్‌గా జమ చేస్తారు. దీనివల్ల డాక్యుమెంట్ల సమర్పణ భారం తప్పుతుంది. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైన తర్వాత, మిగిలిన 25 లక్షల ఖాతాదారులకు కూడా ఈ ఆటోమేటిక్ రీఫండ్ విధానాన్ని విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. చిన్న మొత్తాల కోసం కూడా క్లెయిమ్ ప్రక్రియను సులభతరం చేసి, ఉద్యోగులకు ఆర్థికంగా ఊరట కల్పించడమే ఈ నిర్ణయం ముఖ్య ఉద్దేశం.

# బంగ్లాదేశ్‌లో మరో హిందూ మహిళపై గ్యాంగ్ రేప్

ఢాకా: బంగ్లాదేశ్‌లోని చాంద్‌పూర్ జిల్లాలో హిందూ మహిళపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. గత కొంతకాలంగా బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతోన్న దాడులు, ఆకృత్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత కూడా దాడులు ఆగడం లేదు. నిన్న రాత్రి 9 గంటల సమయంలో ఒంటరిగా ఉన్న దివ్యాంగురాలైన మహిళను బలవంతంగా ఎత్తుకెళ్లి దారుణానికి ఒడిగట్టారు. స్పృహ కోల్పోయిన మహిళను నిందితులు అక్కడే వదిలి వెళ్లిపోయారు. నిర్మానుష్య ప్రాంతంలో ఉన్న ఆ మహిళను గుర్తించిన స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. తనపై రకీబ్, సోహైల్, రస్సెల్ అనే ముగ్గురు యువకులు అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. వారు తనను తీవ్రంగా హింసించి గాయపరిచినట్లు తెలిపింది. అయితే పోలీసులు వారిని అరెస్టు చేయలేదు. దీంతో స్థానికులు, హిందూ సంఘాలు, మానవ హక్కుల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

# బీజేపీ ఎంపీకి బంగ విభూషణ్

**ఎన్నికల వేళ మమత రాజకీయ చాణక్యం**



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇలాంటి సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రభుత్వం ఒక బీజేపీ ఎంపీకి రాష్ట్ర పురస్కారం అందించడం ఆసక్తికరంగా మారింది. బీజేపీ ఎంపీ నాగేన్ రాయ్ సహా పలువురికి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాష్ట్ర పౌర పురస్కారం 'బంగ విభూషణ్' అందించారు. బెంగాల్‌లో బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీల మధ్య నిత్యం ఘర్షణ వాతావరణం ఉంటుంది. ప్రస్తుతం అక్కడ ఈ రెండు పార్టీల మధ్య తీవ్ర పోరు నెలకొని ఉంది. ఇలాంటి తరుణంలో బీజేపీ ఎంపీకి పురస్కారం అందించడం గమనార్హం. నాగేన్ రాయ్ రాజ్ బాంగ్షి సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. ఉత్తర, మధ్య బెంగాల్‌లో ఈ వర్గం ప్రజలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతంలో టీఎంసీ పేలవ ప్రదర్శన కనబరచగా, బీజేపీకి మంచి ఫలితాలు వచ్చాయి. 2023లో నాగేన్ రాయ్ రాజ్యసభ ఎంపీగా నామినేట్ అయ్యారు. రాజ్ బాంగ్షి వర్గం ప్రజలు ఆయనను అనంత్ మహారాజ్‌గా పిలుచుకుంటారు. ముర్షిదాబాద్, మాల్దా, డార్జిలింగ్, ఉత్తర్ దీనాజ్‌పూర్, జల్‌పాయ్ గుడీ వంటి ప్రాంతాల్లో రాజ్ బాంగ్షి ప్రజలు ఉన్నారు. ఈ వర్గంలో బీజేపీ ఎంపీకి పలుకుబడి ఉంది. ఇప్పుడు ఎన్నికలు సమీపించిన సమయంలో ఆ సామాజిక వర్గం బీజేపీ ఎంపీకి పురస్కారం ఇవ్వడం గమనార్హం. నాగేన్ గతంలో టీఎంసీకి దగ్గరగా ఉండేవారనే వాదనలు ఉన్నాయి. ఆ తర్వాత బీజేపీకి చేరువయ్యారు. ఆయన బీజేపీ ఎంపీ అయ్యాక కూడా మమతా బెనర్జీ ఒకసారి ఆయన ఇంటిని సందర్శించారు.

# రేబిస్ భయంతో బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య

థానే: మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఒక విషాద ఘటన చోటుచేసుకుంది. వీధికుక్క కరిచిందన్న కారణంతో, తనకు రేబిస్ వస్తుందేమోనన్న తీవ్ర భయంతో 30 ఏళ్ల బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. కల్యాణ్ ఈస్ట్‌లోని టిస్‌గావ్ నాకా ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే, అయిష్ విశ్వనాథ్ అమీన్ (30) అనే యువకుడు ఓ సహకార బ్యాంకులో గత ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం అతడిని ఓ వీధికుక్క కరిచింది. దీంతో యాంటీ-రేబిస్ వ్యాక్సిన్ వేయించుకున్నప్పటికీ, కేవలం ఒక డోసు మాత్రమే తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ఆ తర్వాత నుంచి అయిష్ తీవ్రమైన మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురయ్యాడు. తన ప్రవర్తనలో కూడా మార్పులు వచ్చినట్లు కుటుంబసభ్యులు గమనించారు. ఈ క్రమంలోనే, తనకు రేబిస్ సోకుతుందనే భయంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాసి ఇంట్లోనే ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. సమాచారం అందుకున్న కొల్సేవాడి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు యాక్సిడెంటల్ డెత్ రిపోర్ట్ (ఏడీఆర్) నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.



# తమిళనాడులో 74 లక్షల ఓట్లు తొలగింపు

చెన్నై: తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగనున్న తరుణంలో ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం ఈరోజు తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్ విడుదల చేశారు. తాజా జాబితా ప్రకారం రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 5.67 కోట్లుగా నమోదైంది. గతంలో ఉన్న 6.41 కోట్ల ఓటర్లతో పోలిస్తే, ఈ ప్రక్షాళనలో ఏకంగా 74 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించడం గమనార్హం. డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్లు, నివాసం మారుతున్న వారి వివరాలను క్షుణ్ణంగా వెరిఫై చేసిన తర్వాతే ఈ భారీ తొలగింపులు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. లింగ నిష్పత్తి పరంగా చూస్తే ఈసారి కూడా తమిళనాడులో మహిళా ఓటర్లే ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. మొత్తం 5,67,07,380 మంది ఓటర్లలో 2.89 కోట్ల మంది మహిళలు ఉండగా, 2.77 కోట్ల మంది పురుషులు, 7,617 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. డిసెంబర్ 19 నుంచి జనవరి 30 వరకు వచ్చిన లక్షలాది అప్లికేషన్లను పరిశీలించి, అర్హులైన కొత్త ఓటర్లను కూడా జాబితాలో చేర్చారు. ఈ వేసవిలో జరగబోయే ఎన్నికల కోసం ఈ జాబితానే కీలకం కానుంది.

# నేటి నుంచి ట్రంప్ సుంకాలకు బ్రేక్

## అమెరికా సుప్రీం ఆదేశాలతో టారిఫ్స్ నిలిపివేత

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన కొన్ని కీలక దిగుమతి సుంకాల వసూళ్లను నిలిపివేస్తున్నట్టు ఆ దేశ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సుంకాలు చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పరిణామం ప్రపంచ వాణిజ్య సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ఒక ప్రకటన విడుదల చేసింది. మంగళవారం నుంచి సుంకాల వసూళ్లు ఆగిపోతాయని తెలిపింది. ఇందుకు సంబంధించిన టారిఫ్ కోడ్‌లను తమ కార్గో సిస్టమ్స్‌లో డియాక్టివేట్ చేస్తున్నట్టు పేర్కొంది. అయితే, ఇప్పటివరకు వసూలు చేసిన సుంకాలను దిగుమతిదారులకు తిరిగి చెల్లిస్తారా? లేదా? అనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. ఫిబ్రవరి 20న సుప్రీంకోర్టు 6-3 మెజారిటీతో ఈ తీర్పు ఇచ్చింది. 1977 నాటి అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టాన్ని ఉపయోగించి ట్రంప్ తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని కోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన గంటల వ్యవధిలోనే ట్రంప్ మరో ఎత్తుగడ వేశారు. మరో చట్టంలోని సెక్షన్ 122 కింద అన్ని దేశాల నుంచి వచ్చే దిగుమతులపై కొత్తగా 15 శాతం గ్లోబల్ టారిఫ్ విధిస్తున్నట్టు ప్రకటించారు. రాయిటర్స్ వార్తా సంస్థ కథనం ప్రకారం.. సుప్రీంకోర్టు తీర్పుతో అమెరికా ప్రభుత్వానికి భారీ ఆర్థిక నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పటివరకు వసూలు చేసిన 175 బిలియన్ డాలర్లకు పైగా సుంకాలను తిరిగి చెల్లించాల్సి రావొచ్చని అంచనా. ఈ తీర్పుతో చైనా, దక్షిణ కొరియా, జపాన్, తైవాన్





వంటి ప్రధాన ఎగుమతి దేశాలకు ఊరట లభించింది. అయితే, జాతీయ భద్రత, అన్యాయమైన వాణిజ్యం వంటి కారణాలతో ట్రంప్ విధించిన ఇతర సుంకాలు యథావిధిగా కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

### హద్దు దాటితే ఆటాడిస్తా: ట్రంప్

వాషింగ్టన్: వివిధ దేశాలపై డొనాల్డ్ ట్రంప్ విధించిన అదనపు సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు తప్పుబట్టిన విషయం తెలిసిందే. అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండా వేసిన ఈ సుంకాలు చెల్లవని తీర్పు వెలువరించింది. ఈ తీర్పుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పును అలుసుగా తీసుకుని ఏ దేశమైనా ఆటలాడాలని చూస్తే భారీ టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఈ తీర్పు ద్వారా తెలియకుండానే తనకు మరిన్ని అధికారాలు కట్టబెట్టిందని వ్యాఖ్యానించారు. కొన్ని దేశాలు అమెరికాను దశాబ్దాలుగా కొల్లగొట్టాయని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పును ఆధారంగా చేసుకుని, ఇష్టానుసారం వ్యవహరించాలని చూస్తే ఇటీవల అంగీకరించిన సుంకాల కంటే భారీగా ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన ట్రూత్ సోషల్ మీడియాలో ఈ హెచ్చరిక జారీ చేశారు. అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టంను ఉపయోగించి డొనాల్డ్ ట్రంప్ తన మాట వినని వివిధ దేశాలపై అధిక పన్ను విధించారు. ట్రంప్ అధిక సుంకాలకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేదు. టారిఫ్ అంశం సుప్రీంకోర్టుకు వెళ్లగా, ట్రంప్ తీరును తప్పుబట్టింది. ఆయన నిర్ణయానికి వ్యతిరేకంగా తీర్పు వెలువరించింది.

# బెంగళూరులో అమెజాన్ క్యాంపస్ ఓపెన్

**ఆసియాలోనే రెండో అతిపెద్దది!**



బెంగళూరు: ప్రముఖ టెక్ దిగ్గజం, ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ భారత్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరించింది. బెంగళూరులో ఆసియాలోనే తన రెండో అతిపెద్ద కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించింది. సుమారు 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో, 12 అంతస్తులతో నిర్మించిన ఈ భారీ క్యాంపస్ నిర్మించారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న తమ ఈ-కామర్స్, ఆపరేషన్స్, పేమెంట్స్, టెక్నాలజీ, సెల్లర్ సర్వీసెస్ విభాగాలకు చెందిన 7,000 మందికి పైగా ఉద్యోగులకు సేవలు అందనున్నాయని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నూతన భవనాన్ని కర్ణాటక భారీ, మధ్య తరహా పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి శాఖ మంత్రి ఎంబీ పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "భారత్‌ను గ్లోబల్ టెక్నాలజీ, ఆవిష్కరణల కేంద్రంగా నిలపడంలో అమెజాన్ పెట్టుబడులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇలాంటి భారీ క్యాంపస్‌ల ద్వారా నాణ్యమైన ఉద్యోగాలు లభించడమే కాకుండా, స్థానిక పర్యావరణ వ్యవస్థ బలపడుతుంది. దేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ఇది ఎంతగానో దోహదపడుతుంది. దీర్ఘకాలిక సామర్థ్యాన్ని పెంపొందించే ఇలాంటి పెట్టుబడులను మేం స్వాగతిస్తున్నాం" అని అన్నారు. భారత్‌లో అమెజాన్ ఇప్పటికే 40 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టగా, 2030 నాటికి మరో 35 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు కట్టుబడి ఉంది. ఈ ప్రణాళికలో భాగంగానే ఈ కొత్త క్యాంపస్‌ను ప్రారంభించారు. కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కార్యాలయాన్ని ఉద్యోగుల మధ్య సహకారాన్ని, సౌలభ్యాన్ని, అభ్యాసాన్ని ప్రోత్సహించేలా రూపొందించినట్లు కంపెనీ పేర్కొంది. "బెంగళూరు ఎప్పటినుంచో మా టెక్నాలజీ, వ్యాపార బృందాలకు నిలయంగా ఉంది. ఆవిష్కరణలు, ప్రతిభకు ఈ నగరం ఇప్పటికీ ఒక కీలక కేంద్రంగా కొనసాగుతోంది" అని అమెజాన్ ఇండియా కంట్రీ మేనేజర్ సమీర్ కుమార్ తెలిపారు. ఈ క్యాంపస్‌లో అత్యాధునిక వర్క్‌స్పేస్‌లు, సమావేశ గదులు, 200 మందికి పైగా కూర్చునే సామర్థ్యం గల ఈవెంట్ స్పేస్‌లు ఉన్నాయి. ఉద్యోగుల మానసిక, శారీరక ఆరోగ్యం కోసం బాస్కెట్‌బాల్, పికెల్‌బాల్ కోర్టులు, యాంఫిథియేటర్, పచ్చిక బయళ్లు వంటి వినోద సౌకర్యాలను కూడా ఏర్పాటు చేశారు. రెండు అంతస్తులలోని కెఫెటేరియాలలో అంతర్జాతీయ వంటకాలు అందుబాటులో ఉంటాయి. పర్యావరణ హితంగా, కర్బన ఉద్గారాలను తగ్గించేలా బాధ్యతాయుతమైన మెటీరియల్స్ వాడకం, ఆస్తుల పునర్వినియోగం వంటి చర్యలు తీసుకున్నట్లు అమెజాన్ వివరించింది.

# బ్యాంకుల వల్లే బంగారం ధరలు

**కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్**

న్యూఢిల్లీ: ప్రపంచంలోని ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు పెద్ద మొత్తంలో బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయని, పసిడి ధరల అనూహ్య పెరుగుదలకు ఇదే కారణమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో కలిసి ఏర్పాటు చేసిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, దేశంలోకి బంగారం, వెండి దిగుమతులు ఆందోళనకర స్థాయిలో ఏమీ లేవని అన్నారు. వాటిని ఆర్బీఐ ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని తెలిపారు. బంగారం దిగుమతులపై తాము ఆందోళన చెందడం లేదని, కరెంట్ ఖాతా లోటు నిర్వహించదగిన స్థాయిలోనే ఉందని వెల్లడించారు. బ్యాంకులు తమ కోర్ వ్యాపారంపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. భారత్ వృద్ధి పథంలో పయనిస్తోందని, అందులో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడులను పెంచాలని నిర్మలా సీతారామన్ కోరారు. అమెరికా టారిఫ్ అంశంపై కూడా ఆమె స్పందించారు. వివిధ దేశాలపై డొనాల్డ్ ట్రంప్ విధించిన అధిక



సుంకాలను అక్కడి సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ క్రమంలో భారత్ సహా అన్ని దేశాలపై 15 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ మార్పుల ప్రభావం భారత్‌పై ఎలా ఉంటుందని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ అంశాన్ని సమీక్షిస్తోందని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ అంశంపై అప్పుడే వ్యాఖ్యానించడం తొందరపాటు అవుతుందని అన్నారు.

వయ్యారి చిత్రం



# టాక్సిక్.. 'కర్మది' కలకం

కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా, గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ 'టాక్సిక్'. ఈ చిత్రాన్ని కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణతో కలిసి యష్ స్వయంగా నిర్మిస్తున్నారు. కియారా అద్వానీ, నయనతార, హుమా ఖురేషి వంటి అగ్ర నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం ఉగాది కానుకగా మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతోంది. ఈనేపథ్యంలో.. తాజాగా ఈ సినిమా నుండి 'కర్మది' అనే పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేస్తూ, ఆ పాత్రలో నటించిన సుదేవ్ నాయర్ గురించి గీతూ మోహన్ దాస్ ఒక ఎమోషనల్ నోట్ పంచుకుంది. ఈ ప్రయాణంలో సుదేవ్ పాత్ర , ఆయన మద్దతు ఎంత కీలకమో మేకర్స్ వివరించారు. 'కర్మది' పాత్రకు సరైన నటుడు దొరక్కపోతే ఈ సినిమా ప్రయాణం చాలా కష్టమయ్యేదని, సుదేవ్ ఆ లోటును భర్తీ చేశారని పేర్కొన్నారు. ఆయన ఈ చిత్రానికి ఒక నిశ్శబ్ద బలంలా నిలిచారని ప్రశంసించారు. సుదేవ్ నైపుణ్యం చాలా శక్తివంతమైనదని, అయితే అది ఎప్పుడూ తక్కువ అంచనా వేయబడిందని గీతూ మోహన్ దాస్ అభిప్రాయపడ్డారు. ఆయన కేవలం తన పాత్రకే కాకుండా, సినిమా మొత్తం ప్రయాణానికి తనను తాను అంకితం చేసుకున్నారని కొనియాడారు. అతిశయోక్తి లేకుండా భావోద్వేగాలను పండించడంలో సుదేవ్ దిట్ట అని, సెట్‌లో ఆయన ఉంటే ఒక రకమైన సానుకూల శక్తి ఉంటుందని తెలిపారు.. ప్రతిభ మాత్రమే ఒక మనిషిని ఎక్కువ కాలం నిలబెట్టదని, మంచి వ్యక్తిత్వం ఉన్నప్పుడే ఎవరైనా నిజంగా అభివృద్ధి చెందుతారని దర్శకురాలు ఈ సందర్భంగా పేర్కొన్నారు. సుదేవ్ కేవలం ఒక నటుడిగా ఉండటానికే కాకుండా, సినిమా రంగంలో గొప్ప స్థాయికి ఎదగడానికి అన్ని అర్హతలు ఉన్న వ్యక్తి అని నొక్కి చెప్పారు. గతంలో కూడా ఆయనతో కలిసి పనిచేసిన అనుభవం ఉండటంతో, ఆయన ప్రతిభపై తనకు పూర్తి నమ్మకం ఉందని వెల్లడించారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం, ఉగాది సందడిని ముందే తీసుకురావడానికి సిద్ధంగా ఉంది. 'టాక్సిక్'లో యష్ కొత్త అవతారాన్ని చూడాలని అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.






# సర్దార్ 2 సాహసానికి సవాల్

ప్రముఖ సినిమాటోగ్రాఫర్ మోహనన్ కుమార్తెగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మాళవిక మోహనన్ సర్దార్2 సినిమా చేస్తోంది. సినిమాలో ఈ పాత్ర ప్రత్యేక ఆకర్షణ గా నిలుస్తుందని సమాచారం. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ సినిమాలో ఆమెకు కొన్ని కూల్, చాలెంజింగ్ సీన్స్ ఉన్నాయని స్వయంగా మాళవికనే వెల్లడించారు. ముఖ్యంగా యాక్షన్ ఎపిసోడ్‌లు ప్రేక్షకుల నరాలు కదిలేలా ఉంటాయని, వాటి కోసం ఎంతో శ్రమించాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు. సాధారణంగా హీరోలకే పరిమితమయ్యే హై ఆక్టేన్ సీన్స్‌లో తాను భాగమవడం తనకు కొత్త అనుభవమని చెప్పారు. సర్దార్2 మూవీలో తన క్యారెక్టర్ గత సినిమాల కంటే భిన్నంగా ఉండబోతుందని మాళవిక స్పష్టం చేశారు. ఈ మూవీలో శారీరకంగా మాత్రమే కాకుండా మానసికంగా కూడా సిద్ధమవాల్సిన సీన్స్ ఉన్నాయని, యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం స్పెషల్ ట్రైనింగ్ తీసుకున్నట్లు ఆమె తెలిపారు. భారీ సెటప్‌ల మధ్య, టెక్నికల్‌గా కఠినమైన సీన్స్ లో నటించడం తనకొక పెద్ద సవాలుగా అనిపించిందని.. అయినప్పటికీ ఆ కష్టానికి ఫలితం తెరపై కనిపిస్తుందని నమ్మకంగా చెబుతున్నారు మాళవిక.

# ఆయా షేర్.. పూనకాలే!

టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ అంటేనే ప్రేక్షకుల్లో ఒక ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'దసరా' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయి ప్రభంజనం సృష్టించిందో అందరికీ తెలిసిందే.




ఇప్పుడు అదే మ్యాజిక్‌ను రిపీట్ చేయడానికి, అంతకు మించిన పవర్ ప్యాక్డ్ యాక్షన్‌తో 'ది ప్యారడైజ్' అనే సినిమాతో మన ముందుకు వస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ సింగిల్ ప్రోమో విడుదలై సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. 'ఆయా షేర్' అనే పేరుతో వచ్చిన ఈ సాంగ్ ప్రోమోలో నాని కనిపించిన తీరు అభిమానులకు పూనకాలు తెప్పిస్తోంది. గడ్డం, జుట్టు పెంచి రెండు జడలతో పక్కా మాస్ లుక్‌లో నానిని చూస్తుంటే, శ్రీకాంత్ ఓదెల మరోసారి థియేటర్లలో రచ్చ చేయడం ఖాయమనిపిస్తోంది. ముఖ్యంగా నాని బాడీ లాంగ్వేజ్ ,స్క్రీన్ ప్రెజెన్స్ ఈ సినిమాపై అంచనాలను పెంచేశాయి.

# చిర్రెత్తుకొచ్చిన సమంత..!



ప్రముఖ పాన్ ఇండియా హీరోయిన్ సమంత ప్రస్తుతం 'మా ఇంటి బంగారం' సినిమా లో లీడ్ రోల్ పోషించడమే కాకుండా ఆ చిత్రానికి నిర్మాతగా కూడా వ్యవహరిస్తోంది. మే 15వ తేదీన ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ నేపథ్యంలోనే అటు అభిమానులతో ఇంటరాక్ట్ అవ్వడానికి సోషల్ మీడియా వేదికగా అభిమానులతో ముచ్చటిస్తూ కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ముఖ్యంగా తన వ్యక్తిగత విషయాలను నెగిటివ్ చేయాలని చూస్తే అసలు ఊరుకోనని చెప్పిన ఈమె.. అలాంటి వారిని బ్లాక్ లిస్టులో పెట్టేస్తాను అంటూ కామెంట్లు చేయడం సంచలనంగా మారింది. అందులో భాగంగానే సమంత మాట్లాడుతూ.. 'ఇలాంటి విమర్శలు, ప్రశంసలు నన్ను ఏమాత్రం ప్రభావితం చేయవు. కానీ ఎవరైనా సరే నా వ్యక్తిగత విషయంలోకి నెగెటివిటీని తీసుకొస్తే మాత్రం బ్లాక్ లిస్టులో పెట్టేస్తాను. బ్లాక్ చేయడం అంటే నేను బాధపడడం కాదు అలాంటి వారిని నా దగ్గరకు కూడా రానివ్వను' అంటూ ఘాటుగా సమాధానం ఇచ్చింది. మొత్తానికైతే తన జోలికి ఎవరైనా వస్తే ఇక అలాంటి వారిని పూర్తిగా దూరం పెట్టేస్తానని స్పష్టం చేసింది. సమంత మే 15వ తేదీనే ఎందుకు మా ఇంటి బంగారం సినిమాను తీసుకొస్తోంది? ఆరోజే ఎందుకు? అనే కామెంట్లు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇక అసలు విషయంలోకి వెళ్తే.. మే 15న అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం. ఈ సందర్భంగానే ఆమె తన మా ఇంటి బంగారం అనే సినిమాను రిలీజ్ చేయాలని ప్లాన్ చేసినట్లు సమాచారం. మొత్తానికైతే పక్కా ప్లానింగ్ తోనే ప్రేక్షకుల ముందుకు వస్తున్న సమంత..ఈ సినిమాతో ఎలాంటి రికార్డ్స్ క్రియేట్ చేస్తుందో చూడాలి. తెలుగులో రీ ఎంట్రీలో సాలిడ్ హిట్ అందుకోవాలని

# రేసింగ్ ఫెస్టివల్‌లో నాగచైతన్య

టాలీవుడ్ యంగ్ హీరో నాగ చైతన్ గోవాలో జరిగిన ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ రౌండ్ 4లో సందడి చేశారు. ఉత్కంఠభరిత పోటీలు, మోటార్ స్పోర్ట్స్ ఉత్సాహంతో నిండిన ఈ ఈవెంట్‌లో చైతన్య స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచారు. గోవా సర్క్యూట్‌లో నిర్వహించిన ఈ స్ట్రీట్ రేసింగ్ ఈవెంట్‌కు దేశం నలుమూలల నుంచి రేసింగ్ అభిమానులు పెద్ద ఎత్తున తరలిరాగా, ఈ వేడుకలో తన సొంత ఫ్రాంచైజీ అయిన హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ టీమ్ కు సపోర్ట్ గా నాగ చైతన్య హాజరయ్యారు. మోటార్ స్పోర్ట్స్‌పై స్పెషల్ ఇంట్రెస్ట్ ఉన్న నాగ చైతన్య, హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ టీమ్ ఓనర్ గా ఈ రేసింగ్ లీగ్‌లో భాగమయ్యారు. గోవా వీధుల మధ్య ఏర్పాటు చేసిన ప్రత్యేక ట్రాక్‌పై కార్లు గర్జిస్తూ పరిగెత్తగా, వాటిని చూసి ప్రేక్షకులు ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. ఈ హై-ఆక్టేన్ పోటీల్లో పాల్గొన్న డ్రైవర్లను నాగ చైతన్య స్వయంగా ప్రోత్సహిస్తూ కనిపించారు. ట్రాక్ పక్కనే నిలబడి జట్టు సభ్యులతో చర్చలు జరిపిన ఆయన, ప్రతి ల్యాప్‌ను ఆసక్తిగా వీక్షిస్తూ రేస్ వాతావరణాన్ని ఆస్వాదించారు. ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ ఈ సీజన్‌లో ఇప్పటికే మంచి రెస్పాన్స్ ను అందుకుంటోంది. ముఖ్యంగా స్ట్రీట్ సర్క్యూట్ ఫార్మాట్ రేసింగ్ అభిమానులకు కొత్త అనుభూతిని అందిస్తోంది. గోవాలో జరిగిన రౌండ్ 4 ఈవెంట్‌కు భారీగా ప్రేక్షకులు హాజరుకావడం, మోటార్ స్పోర్ట్స్‌పై యువతలో పెరుగుతున్న ఆసక్తిని స్పష్టంగా తెలియచేస్తుంది. హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ టీమ్ పెర్ఫార్మెన్స్ కూడా ఆడియన్స్ ను ప్రత్యేకంగా ఆకట్టుకుంది. టీమ్ డ్రైవర్లు ఆత్మవిశ్వాసంతో పోటీ పడుతూ పాయింట్స్ టేబుల్ లో మెరుగైన స్థానాన్ని టార్గెట్ గా పెట్టుకున్నారు.






# 27న డెకాయిట్ 'రుబారూ' సాంగ్ రిలీజ్

థ్రిల్లర్ స్టోరీలతో వరుస విజయాలు అందుకున్న అడవి శేష్.. ప్రస్తుతం తెలుగు-హిందీ పాన్ ఇండియా బైలింగ్వల్ మూవీ డెకాయిట్‌లో నటిస్తున్నారు. ఆ సినిమాలో ఆయనకు జోడీగా బాలీవుడ్ భామ మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు- నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షూటింగ్ అప్డేట్స్, టీజర్ తో ఇప్పటికే భారీ అంచనాలు క్రియేట్ చేసుకున్న ఆ చిత్రానికి సంబంధించిన మరో అప్డేట్ తాజాగా వచ్చింది. సినిమాలోని తొలి పాట 'రుబారూ..'ను ఫిబ్రవరి 27వ తేదీన విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇది ఒక హృదయాన్ని తాకే సోల్ ఫుల్ మెలోడీగా ఉండబోతుందని తెలిపారు. డెకాయిట్ గా మారే ముందు హీరో హృదయం ప్రేమలో ఎలా పడిందో.. రుబారూ పాటలో చూపించనున్నారని సమాచారం. అయితే సాంగ్ రిలీజ్ డేట్ అనౌన్స్మెంట్ సమయంలో మేకర్స్ విడుదల చేసిన పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అందరినీ ఆకట్టుకుంటోంది. వైట్ కలర్ డ్రెస్ లో మృణాల్ ఠాకూర్ అందంగా కనిపిస్తుండగా, అడివి శేష్ మాత్రం ఇప్పటివరకు కనిపించని కొత్త లుక్ లో కనిపిస్తున్నారు.





# విండీస్ 254

## టీ20 వరల్డ్ కప్‌లో రికార్డు స్కోర్ .. జింబాబ్వేపై విధ్వంసం

### హెట్‌మెయిర్ ఊచకోత.. మోతీ, హుసేన్ విజృంభణ

**టీ20 ప్రపంచకప్‌లో మాజీ చాంపియన్ వెస్టిండీస్ దుమ్మురేపింది. లీగ్ దశ గెలుపు జోరును కీలకమైన సూపర్-8లోనూ కొనసాగిస్తూ జింబాబ్వేను చిత్తుచేసింది. సోమవారం వాంఖడే వేదికగా జరిగిన పోరులో విండీస్ 107 పరుగుల తేడాతో జింబాబ్వేపై భారీ విజయం సాధించింది. పసలేని జింబాబ్వే బౌలింగ్‌ను ఉతికి ఆరేస్తూ హార్డ్‌హిట్టర్ షిమ్రాన్ హెట్‌మెయిర్(34 బంతుల్లో 85, 7ఫోర్లు, 7సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీకి తోడు రోవ్‌మన్ పావెల్(35 బంతుల్లో 59, 4ఫోర్లు, 4సిక్స్‌లు) సమయోచిత ఇన్నింగ్స్‌తో వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 254/6 రికార్డు స్కోరు నమోదు చేసింది.**



**ఓవరాల్‌గా పొట్టి ప్రపంచకప్‌లో రెండో అత్యధిక టీమ్ స్కోరును విండీస్ దక్కించుకుంది. 54 పరుగులకే ఓపెనర్లు బ్రాండన్ కింగ్(9), షాయ్ హోప్(14) వికెట్లు కోల్పోయిన విండీస్‌ను హెట్‌మెయిర్, పావెల్ ఒడ్డున పడేశారు. టోర్నీలో తన సూపర్‌ఫామ్‌ను కొనసాగిస్తూ హెట్‌మెయిర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. నగారవ(2/47), బ్లెస్సింగ్ ముజర్బని(2/42) రెండేసి వికెట్లు తీశారు. 255 పరుగుల లక్ష్యఛేదనలో జింబాబ్వే 17.4 ఓవర్లలో 147 స్కోరుకే కుప్పకూలింది. గుడకేశ్ మోతి(4/28), అఖిల్ హుసేన్(3/28) స్పిన్ ధాటికి జింబాబ్వే బ్యాటర్లు నిలదొక్కుకోలేకపోయారు.**

బ్రాడ్ ఇవాన్స్(43) మినహా మిగతావాళ్లు ఘోరంగా తేలిపోయారు. అర్ధసెంచరీతో జట్టు భారీ స్కోరుకు కారణమైన హెట్‌మెయిర్కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. టాస్ గెలిచిన జింబాబ్వే..విండీస్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. తాము తప్పు చేశామని తెలుసుకోవడానికి జింబాబ్వేకు పెద్దగా సమయం పట్టలేదు. విండీస్ ఓపెనర్లు స్వల్ప స్కోర్లకే ఔటైన ఆనందం ఎక్కువ సేపు నిలువలేదు. ఫస్ట్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన హెట్‌మెయిర్ మ్యాచ్ గతిని మార్చేశాడు. 9 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద హెట్‌మెయిర్ ఇచ్చిన క్యాచ్‌ను బౌండరీ వద్ద జింబాబ్వే అరంగేట్రం ప్లేయర్ తశింగ ముసెకివా విడిచిపెట్టడం విండీస్‌కు కలిసి వచ్చింది. తనకు దక్కిన అవకాశాన్ని అనుకూలంగా మలుచుకుంటూ హెట్‌మెయిర్ బ్యాట్‌కు పనిచెప్పాడు. అప్పటి వరకు చప్పగా సాగిన ఇన్నింగ్స్ హెట్‌మెయిర్ వీరవిహారంతో పతాకస్థాయికి వెళ్లింది. బౌలింగ్ మార్పుగా వచ్చిన కెప్టెన్ సికిందర్ రజాను హెట్‌మెయిర్ ఓ ఆటాడుకున్నాడు. మూడు భారీ సిక్స్‌లతో హెట్‌మెయిర్ కొట్టిన కొట్టుడుకు వాంఖడే హోరెత్తిపోయింది. ఈ క్రమంలో 19 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. మరో ఎండ్‌లో రోవ్‌మన్ పావెల్..హెట్‌మెయిర్కు చక్కని సహకారం అందించాడు. సింగిల్స్ స్ట్రైక్ రొటేట్ చేస్తూ హెట్‌మెయిర్ అవకాశాలు ఇస్తూ పోయాడు. మరోవైపు 70 పరుగుల వద్ద మరోమారు తశింగ క్యాచ్ విడిచిపెట్టడంతో రెండోసారి లైఫ్‌ను హెట్‌మెయిర్ విడిచిపెట్టుకోలేదు. ఈసారి అంతే కసిగా బౌండరీలు బాదగా, పావెల్ 29 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. క్రీమర్ బౌలింగ్‌లో హెట్‌మెయిర్ ఔట్ కావడంతో మూడో వికెట్‌కు 122 పరుగుల భారీ భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత పావెల్, షెఫర్డ్(21), హోల్డర్(13) బ్యాటు ఝులిపించడంతో విండీస్‌కు భారీ స్కోరు సాధ్యమైంది. భారీ ఛేదనలో జింబాబ్వే ఏ దశలోనూ లక్ష్యం వైపు సాఫీగా సాగలేదు. ఫోర్డె రెండో ఓవర్‌లోనే ఓపెనర్ మరుమని(14) ఔట్ కావడంతో జింబాబ్వే వికెట్ల పతనానికి నాంది పడింది. పిచ్‌పై అంచనాకు వచ్చిన విండీస్ కెప్టెన్..స్పిన్నర్లను దించడంతో జింబాబ్వే వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ఓ ఎండ్‌లో గుడకేశ్ మోతీ, మరో ఎండ్‌లో అఖిల్ హుసేన్..జింబాబ్వే బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. భారీ షాట్లు ఆడే క్రమంలో వికెట్లు సమర్పించుకున్నారు. ఓవైపు సహచరులు నిష్క్రమిస్తున్నా..కెప్టెన్ సికిందర్ రజా(27) నిలదొక్కుకునే ప్రయత్నం చేశాడు. ర్యాన్ బర్ల్(0), ముసెకెవా(0) సున్నాలు చుట్టగా, మోతీ బౌలింగ్‌లో రజా క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఆఖర్లో ఇవాన్స్ ఐదు భారీ సిక్స్‌లతో చెలరేగినా అంతరం తగ్గినా ఓటమి వైపు నిలువాల్సి వచ్చింది.

## ఇండియన్స్‌కు మేమంటే ఇష్టం

**కివీస్ ప్లేయర్ డారిల్ మిచెల్**

టీమ్‌ఇండియా తర్వాత.. భారత క్రికెట్ ఫ్యాన్స్ ఎక్కువగా న్యూజిలాండ్ జట్టును అభిమానిస్తుంటారు. ఆ జట్టు ఏ టోర్నీలో ఆడినా మద్దతుగా నిలుస్తుంటారు. అందుకే, తమ జట్టును భారత్‌లో రెండో ఫేవరెట్ టీమ్‌గా పిలుస్తారని న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్ అన్నాడు. టీ20 ప్రపంచ కప్‌లోనూ టీమ్‌ఇండియా ఫ్యాన్స్ తమకు మద్దతు నిలుస్తున్నారని చెప్పాడు. ఒకవేళ తమ జట్టు భారత్‌తో ఆడుతున్నా సరే.. కొందరు అభిమానులు బ్లాక్ జెర్సీలను ధరిస్తారని పేర్కొన్నాడు. 'భారత అభిమానులకు మేం రెండో ఫేవరెట్ జట్టు అని భావిస్తున్నాం. ఇక్కడి అభిమానుల మద్దతు దక్కడం అద్భుతం. టీ20 ప్రపంచ కప్‌లో భారత్‌తో మ్యాచ్ తలపడాల్సి వచ్చినప్పుడు మా టీమ్‌కూ కొందరు సపోర్ట్‌గా బ్లాక్ జెర్సీలను ధరిస్తారు. అందుకే, భారత్ వేదికగా మ్యాచులు ఆడటమంటే మాకు చాలా ఇష్టం' అని మిచెల్ వెల్లడించాడు. 'న్యూజిలాండ్‌లో మేం పేస్, బౌన్సీ, పచ్చికతో కూడిన పిచ్‌లపై ఆడుతూ పెరిగాం. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఆడిన అనుభవంతో ఇక్కడ పరిస్థితులు కొత్తగా ఏమీ అనిపించడం లేదు. నాణ్యమైన క్రికెట్ ఆడి టీ20 ప్రపంచ కప్‌ను గెలిచేందుకు ప్రయత్నిస్తాం. అయితే, భవిష్యత్తు కంటే వర్తమానంలో ఉండి పరిస్థితులకు తగినట్టుగా ఆడతాం.





## ఇలాగైతే కష్టమే..!

### బ్యాటింగ్‌లో తడబాటు.. పసలేని బౌలింగ్.. చురుగ్గా లేని ఫీల్డింగ్.. వ్యూహాల్లో లోపాలు

(ఈవార్తలు క్రీడా విభాగం)

టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా అహ్మదాబాద్‌లో జరిగిన సూపర్ 8 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ 76 పరుగుల భారీ తేడాతో ఓటమిని చవిచూడటంతో గత 12 మ్యాచ్‌ల విజయ పరంపరకు అడ్డుకట్ట పడింది. ఒకసారి ఆటగాళ్ల పరిస్థితిని గమనిస్తే ఈ టోర్నీలో అనేక అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఓపెనర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ ఈ టోర్నీలో నిలకడలేమితో సతమతమవుతున్నారు. దక్షిణాఫ్రికాతో జరిగిన ఈ మ్యాచ్‌లోనూ పవర్‌ప్లే ముగిసేసరికి భారత్ 31/3 స్కోరుతో తీవ్ర కష్టాల్లో పడింది. అహ్మదాబాద్ పిచ్‌పై బంతి నెమ్మదిగా వస్తున్నప్పటికీ, భారత బ్యాటర్లు పరిస్థితులకు అనుగుణంగా ఆడకుండా అనవసర భారీ షాట్లకు ప్రయత్నించి వికెట్లు పారేసుకున్నారు. ముఖ్యంగా తిలక్ వర్మ తక్కువ స్ట్రైక్ రేట్‌తో ఆడి ఒత్తిడిని పెంచాడు. గత 2024 ఫైనల్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడిన అక్షర్ పటేల్‌ను కాదని వాషింగ్టన్ సుందర్‌ను తీసుకోవడం జట్టుకు ప్రతికూలంగా మారింది. సుందర్ బ్యాటింగ్‌లోనూ, బౌలింగ్‌లోనూ ప్రభావం చూపలేకపోయారు. దక్షిణాఫ్రికా 20/3 స్కోరు వద్ద ఉన్నప్పుడు మ్యాచ్‌పై పట్టు సాధించే అవకాశం ఉన్నా, డేవిడ్ మిల్లర్ (63), డెవాల్డ్ బ్రెవిస్ (45) మధ్య 97 పరుగుల భాగస్వామ్యాన్ని అడ్డుకోవడంలో భారత బౌలర్లు విఫలమయ్యారు.

## భారత్ ఓటమి.. పాక్ క్రికెటర్ వికృత నవ్వులు

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ 76 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలవ్వడంపై పాకిస్థాన్ మాజీ పేసర్ మహమ్మద్ ఆమిర్ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాడు. టీమిండియా పరాజయాన్ని ఆస్వాదిస్తూ మహమ్మద్ ఆమిర్ చేసిన కామెంట్స్, ప్రవర్తించిన తీరు ఇప్పుడు భారత క్రికెట్ అభిమానులకు తీవ్ర ఆగ్రహం తెప్పిస్తోంది. పాకిస్థాన్‌లోని ఓ టీవీ టాక్ షోలో పాల్గొన్న మహమ్మద్ ఆమిర్.. టీమిండియాను టార్గెట్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నాడు. అంతకు ముందు యువ ఓపెనర్ అభిషేక్ శర్మను 'స్లాగర్' (గుడ్డిగా బ్యాట్ గాలికి ఊపేవాడు) అని విమర్శించిన ఆమిర్.. టీమిండియా సెమీఫైనల్ చేరదని జోస్యం చెప్పాడు. అన్నట్లుగానే సూపర్-8 తొలి మ్యాచ్‌లో భారత్ ఓడిపోయేసరికి.. సదరు షో హోస్ట్ ఆమిర్‌ను 'ఆస్ట్రాలజర్' (జ్యోతిష్యుడు) అని సంబోధించాడు. హోస్ట్ తనను జ్యోతిష్యుడని పిలవగానే.. మహమ్మద్ ఆమిర్ ఎంతో గర్వంగా, బేషరమ్‌గా నవ్వడం మొదలుపెట్టాడు. తన అంచనా నిజమవుతోందన్న ఆనందం అతని నవ్వులో స్పష్టంగా కనిపించింది. 'నన్ను ఏం చేసేశారయ్యా మీరు? అల్లా క్షమించు గాక' అంటూ నవ్వుతూనే భారత్ పరిస్థితిని ఎద్దేవా చేశాడు. భారత జట్టు ఓటమిని చూసి పండగ చేసుకుంటున్న ఆమిర్ తీరుపై నెటిజన్లు మండిపడుతున్నారు.



## ఒత్తిడిలో కాటేరమ్మ చిన్న కొడుకు

టీ20 ప్రపంచ కప్ 2026లో టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్ ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. దక్షిణాఫ్రికాతో జరిగిన కీలక సూపర్-8 మ్యాచ్‌లో కూడా అభిషేక్ శర్మ(12 బంతుల్లో 15 పరుగులు) తక్కువ స్కోరుకే వెనుదిరగడంపై భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ స్పందించారు. టోర్నీకి ముందు అద్భుతమైన ఫామ్‌లో ఉన్న అభిషేక్ శర్మ.. ప్రపంచ కప్ వంటి మెగా ఈవెంట్లో ఎందుకు తడబడుతున్నారో గవాస్కర్ విశ్లేషించారు. స్టార్ స్పోర్ట్స్‌తో సునీల్ గవాస్కర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్నప్పుడు ఉండే ఒత్తిడి ఆటగాడి సహజసిద్ధమైన శైలిని ఎలా దెబ్బతీస్తుందో వివరించారు. 'నెట్స్‌లో ప్రాక్టీస్ చేసేటప్పుడు ఔట్ అయినా మళ్లీ బంతిని ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. కానీ మ్యాచ్‌లో అలా కాదు, ఒక్క వికెట్ పడితే అంతా అయిపోతుంది. ఆ ఒత్తిడి కారణంగా ఆటగాడి కాళ్లు, చేతులు ఒక్కోసారి స్తంభిస్తాయి . అందుకే అభిషేక్ తన ఫ్రీడమ్‌ను కోల్పోయి ఆడుతున్నాడు' అని గవాస్కర్ అభిప్రాయపడ్డారు. దక్షిణాఫ్రికా బౌలర్లు అభిషేక్ శర్మను కట్టడి చేయడానికి పక్కా వ్యూహంతో బరిలోకి దిగారని గవాస్కర్ పేర్కొన్నారు. కేవలం అభిషేక్ శర్మ మాత్రమే కాదు.. మిగిలిన భారత బ్యాటర్ల ప్రదర్శనపై కూడా సునీల్ గవాస్కర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

## దెబ్బతీస్తున్న లెఫ్ట్-లెఫ్ట్ కాంబినేషన్

భారత టాపార్డర్ అంతా ఎడమచేతి వాటం బ్యాటర్లతోనే (అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ) నిండిపోయింది. ఇది ప్రత్యర్థి జట్ల స్పిన్నర్లకు వరంగా మారుతోంది. ఈ ఏకపక్ష బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చాలని కోచింగ్ స్టాఫ్ భావిస్తోంది. సహాయ కోచ్ ర్యాన్ టెన్ డోష్చేట్ మాట్లాడుతూ.. "సంజూ శాంసన్ ఓ అద్భుతమైన ఆటగాడు. అతనిని టాపార్డర్‌లో చేర్చడం వల్ల వ్యూహాత్మకంగా రైట్ హ్యాండ్ - లెఫ్ట్ హ్యాండ్ కాంబినేషన్ సెట్ అవుతుంది. జట్టులో మార్పుల గురించి రాబోయే రెండు రోజుల్లో చర్చిస్తాం" అని పేర్కొన్నారు. కేవలం అభిషేక్ శర్మ మాత్రమే కాదు.. తిలక్ వర్మ, రింకూ సింగ్ ప్రదర్శనలపై కూడా మేనేజ్‌మెంట్ అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ఈ ముగ్గురిలో కనీసం ఒకరిని పక్కన పెట్టడం ఖాయంగా కనిపిస్తోంది. భారీ హిట్టర్‌గా పేరున్న రింకూ సింగ్ దక్షిణాఫ్రికాపై డకౌట్ అవ్వడం టీమిండియా మిడిలార్డర్ బలహీనతను బయటపెట్టింది.

## 8 ఏళ్ల తర్వాత దక్షిణాఫ్రికాకు కంగారులు

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న ఆస్ట్రేలియా సుదీర్ఘ విరామం తర్వాత దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది. సాండ్‌పేపర్‌గేట్ వివాదం తర్వాత ఎనిమిదేళ్లకు ఆసీస్ ఆ దేశంలో అడుగుపెట్టనుంది. రెండు ఫార్మాట్ల సిరీస్‌లో ప్యాట్ కమిన్స్ సారథ్యంలోని కంగారూ టీమ్ సఫారీలతో తలపడనుంది. ఇరుజట్ల మధ్య మొదట వన్డే, ఆపై టెస్టు సిరీస్ జరుగనుంది. రెండు దేశాల బోర్డులు సోమవారం ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. డబ్ల్యూటీసీలో ఆస్ట్రేలియా సెప్టెంబర్‌లో కీలకమైన సిరీస్ ఆడనుంది. దక్షిణాఫ్రికాతో మూడు టెస్టుల్లో కమిన్స్ సేన అమీతుమీ తేల్చుకోనుంది. సఫారీలపై 2018లో సాండ్‌పేపర్ గేట్ వివాదం తర్వాత ఆసీస్ జట్టుకు ఇదే తొలి పర్యటన. అప్పుడు స్టీవ్ స్మిత్ సారథ్యంలో ఆడిన కంగారూలు.. కేప్‌టౌన్ టెస్టులో అనూహ్యంగా వివాదంలో చిక్కుకున్నారు. కామెరూన్ బాన్‌క్రాఫ్ట్ బంతి ఆకారాన్ని మార్చేందుకు సాండ్ పేపర్‌తో రుద్దడం వీడియోల్లో రికార్డైంది. అతడికి కెప్టెన్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్ సహకరించారు. దాంతో.. ఈ ముగ్గురిపై ఆస్ట్రేలియా క్రికెట్ నిషేధం విధించింది.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
మంగళవారం 24-2-2026

# విశ్వాసం లేని రాజకీయం



**ఓటు వేసే క్షణంలో ప్రజలు ఆశను అప్పగిస్తారు; గెలిచిన తరువాత అదే ఆశను పార్టీ మార్పుల పేరుతో వదిలేసే దృశ్యాలు నేటి రాజకీయ వ్యవస్థకు ప్రతీకగా మారాయి. ప్రజాస్వామ్యం అనేది అధికార మార్పిడికి మాత్రమే పరిమితం కాదనే సత్యం పాలకులకు మసకబారుతోంది. ఒకప్పుడు రాజకీయ జీవితం అంటే సిద్ధాంతానికి జీవితాంతం కట్టుబాటు అనే భావన ఉండేది. నేడు ఆ భావన స్థానంలో లెక్కలు, లాభాలు, అధికార సమీకరణలు నిలిచాయి. ఈ పరిణామమే ప్రజాస్వామ్యంలో తీవ్రమైన విశ్వాస సంక్షోభాన్ని సృష్టిస్తోంది.**



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

1950 నుంచి 1980 మధ్య కాలంలో భారత రాజకీయ వ్యవస్థకు స్పష్టమైన నైతిక పునాది ఉండేది. రాజకీయ నాయకత్వం సిద్ధాంతానికి బంధించబడిన జీవన ప్రయాణంగా భావించబడింది. జవహర్‌లాల్ నెహ్రూ స్వాతంత్ర్యం తరువాత దేశాన్ని నడిపించిన విధానం సిద్ధాంత నిబద్ధతకు ప్రతీకగా నిలిచింది. ఆయన రాజకీయ జీవితం మొత్తం ఒకే పార్టీ సిద్ధాంతానికి అంకితం అయింది. పదవులు కన్నా విలువలకు ప్రాధాన్యం ఇచ్చిన నాయకత్వ శైలి అప్పటి రాజకీయ వాతావరణాన్ని నిర్వచించింది. అలాగే అటల్ బిహారీ వాజపేయి తన రాజకీయ జీవితం మొత్తం ఒకే భావజాలానికి కట్టుబడి కొనసాగారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ సిద్ధాంతాన్ని వదలకుండా పోరాడిన నాయకుడిగా గుర్తింపు పొందారు. భారతీయ జనతా పార్టీ ఎదుగుదల వెనుక ఆయన నైతిక రాజకీయ శైలి ప్రధాన పాత్ర పోషించింది. ఎల్.కే. అద్వానీ రాజకీయ జీవితం కూడా దీర్ఘకాలిక సిద్ధాంత నిబద్ధతకు ఉదాహరణగా నిలుస్తుంది. పార్టీ బలోపేతం కోసం ప్రతిపక్ష పాత్రను స్వీకరించినా భావజాలాన్ని మార్చుకోలేదు. అధికారంలో లేకపోయినా సిద్ధాంత పోరాటాన్ని కొనసాగించడం అప్పటి రాజకీయ సంస్కృతికి సూచిక. ఆర్థిక సంస్కరణల కాలంలో దేశాన్ని నడిపించిన పి.వి. నరసింహారావు రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించారు. తీవ్రమైన విమర్శలు ఎదురైనా పార్టీని విడిచిపెట్టకుండా దేశ ప్రయోజనాల దిశగా నిర్ణయాలు తీసుకున్నారు. సిద్ధాంతానికి లోబడి వాస్తవిక నిర్ణయాలు తీసుకోవడం అప్పటి రాజకీయ పరిపక్వతను చూపించింది. సిద్ధాంత రాజకీయాలకు మరో ఉదాహరణగా చంద్రశేఖర్ పేరు నిలుస్తుంది. చిన్న కాలం ప్రధానమంత్రిగా ఉన్నా రాజకీయ జీవితమంతా తన భావజాలాన్ని నిలబెట్టుకున్న నాయకుడిగా గుర్తింపు పొందారు. అధికారం కన్నా రాజకీయ స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇచ్చిన ధోరణి అప్పటి నాయకత్వ లక్షణం.

అదే విధంగా జార్జ్ ఫెర్నాండెస్ కార్మిక వర్గ ఉద్యమాల నుంచి జాతీయ రాజకీయాల వరకు తన సిద్ధాంతాన్ని విడిచిపెట్టకుండా సాగారు. అధికార రాజకీయాల్లో ఉన్నా ప్రజా ఉద్యమ నేపథ్యాన్ని మరిచిపోలేదు. ఈ తరహా నాయకత్వం ప్రజల విశ్వాసాన్ని బలంగా నిలిపింది. కమ్యూనిస్టు రాజకీయ ధారలోనూ సిద్ధాంత నిబద్ధత ప్రధాన లక్షణంగా కనిపించింది. ఈ.ఎం.ఎస్. నంబూదిరిపాద్ వంటి నాయకులు అధికారంలో ఉన్నా సిద్ధాంత పరిమితులను దాటలేదు. కమ్యూనిస్టు పార్టీల్లో పార్టీ మార్పులు అరుదుగా ఉండడం అప్పటి రాజకీయ క్రమశిక్షణకు ఉదాహరణ. ఆ కాలంలో నిర్వహించిన సర్వేల ప్రకారం సుమారు 72% ప్రజలు తమకు నచ్చిన పార్టీ పట్ల దీర్ఘకాలిక విశ్వాసం కలిగి ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ శాతం 78% వరకు ఉండేది. పట్టణ ప్రాంతాల్లో 65% నమోదు అయింది. యువతలో రాజకీయ వ్యవస్థపై నమ్మకం 68% వరకు ఉండేది. ఓటు వేయడం ఒక సిద్ధాంతానికి ఇచ్చే మద్దతుగా భావించబడింది.

1990ల తర్వాత రాజకీయ దృశ్యం మారింది. సంకీర్ణ రాజకీయాలు విస్తరించాయి. 1996 నుంచి 1999 మధ్య 3 సార్లు ప్రధానమంత్రి మారడం రాజకీయ అస్థిరతను సూచించింది. 2000 నుంచి 2010 మధ్య సుమారు 35% మంది శాసనసభ్యులు కనీసం ఒకసారి పార్టీ మారినట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది రాజకీయ నిబద్ధత క్షీణతకు ప్రారంభ సంకేతంగా మారింది. 2014 తర్వాత పార్టీ మార్పులు మరింత సాధారణమయ్యాయి. 2014 నుంచి 2024 మధ్య దేశవ్యాప్తంగా సుమారు 42% మంది శాసనసభ్యులు ఒకసారి లేదా అంతకంటే ఎక్కువసార్లు పార్టీ మారారు. కొన్ని రాష్ట్రాల్లో ఈ శాతం 50 దాటింది. ప్రజలు ఓటు వేసిన పార్టీకి పాలన దక్కకపోవడం సాధారణ రాజకీయ దృశ్యంగా మారింది. 2025లో నిర్వహించిన సర్వే ప్రకారం రాజకీయ వ్యవస్థపై సంపూర్ణ నమ్మకం ఉన్నవారి శాతం కేవలం 38 మాత్రమే. 1990లో ఇదే శాతం 64 ఉండేది. 18 నుంచి 30 వయస్సు గల యువతలో రాజకీయ వ్యవస్థపై నమ్మకం 29 మాత్రమే. 40 పైబడిన వయస్సు గల వారిలో అది 44 వరకు ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో విశ్వాసం 41 కాగా పట్టణ ప్రాంతాల్లో 34 మాత్రమే. మధ్యతరగతి వర్గంలో ఈ శాతం 31కి పడిపోయింది. పార్టీ మార్పుల కారణంగా ఓటరు తన ఓటు విలువ కోల్పోయిన భావనకు లోనవుతున్నాడు. 2024లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం ఈ కారణంతో ప్రజల రాజకీయ విశ్వాసం సుమారు 15 వరకు తగ్గింది. యువతలో రాజకీయ నిరాసక్తత పెరుగుతోంది. 2009లో యువత ఓటింగ్ శాతం 58 కాగా 2019లో అది 52కి తగ్గింది. 2024లో అది సుమారు 49 నమోదు అయింది. నేటి రాజకీయ వ్యవస్థలో వ్యక్తిగత లాభాలు ప్రధాన ప్రమాణంగా మారుతున్నాయి. 2020 నుంచి 2025 మధ్య జరిగిన రాజకీయ సంక్షోభాల్లో సుమారు 60 వరకు పార్టీ మార్పులే ప్రధాన కారణంగా గుర్తించబడ్డాయి. ప్రభుత్వ స్థిరత్వం దెబ్బతింటోంది. అభివృద్ధి కార్యక్రమాలపై దీర్ఘకాలిక ప్రభావం పడుతోంది. ప్రజాస్వామ్య భవిష్యత్తు రాజకీయ నాయకుల నిబద్ధతపై ఆధారపడి ఉంది. పార్టీ మార్పులపై కఠిన నియంత్రణ లేకపోతే ప్రజల విశ్వాసం మరింత తగ్గే ప్రమాదం ఉంది. యువతలో ప్రస్తుతం ఉన్న 29 విశ్వాసాన్ని కనీసం 55 వరకు పెంచడం సాధ్యమే. సాధారణ ప్రజలలో ఉన్న 38 విశ్వాసాన్ని 5 సంవత్సరాల్లో 60కి తీసుకెళ్లడం కూడా సాధ్యమే. దీనికి నాయకత్వంలో నిజాయితీ అవసరం.

> మొత్తంగా చూస్తే పూర్వకాల రాజకీయ వ్యవస్థ సిద్ధాంత నిబద్ధతకు ప్రతీకగా నిలిచింది. నేటి రాజకీయ వ్యవస్థలో ఆ నిబద్ధత తగ్గిపోయింది. పార్టీ మార్పులు ప్రజాస్వామ్య మూలాలను బలహీనపరుస్తున్నాయి. ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం. ఆ ప్రాణాధారాన్ని కాపాడే బాధ్యత రాజకీయ నాయకులపై ఉంది. లేకపోతే ప్రజాస్వామ్యం ఎన్నికల ప్రక్రియగా మాత్రమే మిగిలిపోవడం ఖాయం.

## ప్రజాస్వామ్య విశ్వాస భవిష్యత్తు

ప్రజాస్వామ్య వ్యవస్థ అనేది ఒక కాలానికి పరిమితమైన రాజకీయ ఏర్పాటు కాదు; అది తరతరాల ప్రజల నమ్మకాలపై నిలబడిన దీర్ఘకాలిక ప్రక్రియ. ఈ ప్రక్రియను అర్థం చేసుకోవాలంటే నేటి పరిస్థితులను గతంతో పోల్చి చూడాల్సిన అవసరం ఉంది. 1950 నుంచి 1980 మధ్య కాలంలో భారత ప్రజాస్వామ్యం ప్రజల విశ్వాసంతో ముందుకు సాగింది. ఆ కాలంలో రాజకీయ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం సుమారు 70% నుంచి 75% మధ్యలో ఉండేది. ఓటు వేయడం ప్రజలకు ఒక గౌరవంగా భావించబడేది. రాజకీయ నాయకత్వం అంటే సేవ, త్యాగం అనే భావన ప్రజల మనసుల్లో బలంగా ఉండేది. 1980 తర్వాత పరిస్థితులు క్రమంగా మారాయి. 1990 నాటికి రాజకీయ వ్యవస్థపై ప్రజల నమ్మకం సుమారు 64%గా నమోదైంది. ఈ దశలోనే రాజకీయాలలో అవకాశవాద ధోరణులు మొదలయ్యాయి. సంకీర్ణ రాజకీయాల ప్రవేశంతో పాటు పార్టీ మార్పులు కొంతమేరకు ఆమోదయోగ్యంగా మారాయి. అయినప్పటికీ ప్రజల విశ్వాసం పూర్తిగా క్షీణించలేదు. 1995 నాటికి కూడా గ్రామీణ ప్రాంతాలలో రాజకీయ వ్యవస్థపై నమ్మకం 68%గా ఉండేది. పట్టణ ప్రాంతాలలో అది 60% స్థాయిలో కొనసాగింది. 1996 నుంచి 1999 మధ్య జరిగిన రాజకీయ పరిణామాలు ప్రజల ఆలోచనల్లో కీలక మార్పును తీసుకొచ్చాయి. ఈ 3 సంవత్సరాలలో 3 సార్లు ప్రధానమంత్రి మారడం రాజకీయ అస్థిరతకు ప్రతీకగా నిలిచింది. ఈ దశలో ప్రజల నమ్మకం 64% నుంచి 55%కి తగ్గినట్లు కొన్ని సర్వేలు సూచించాయి. యువతలో రాజకీయాలపై విశ్వాసం 50% స్థాయికి దిగజారింది. అయినప్పటికీ ప్రజాస్వామ్యం పట్ల సంపూర్ణ నిరాశ అప్పటికి ఇంకా కనిపించలేదు.

2000 నుంచి 2010 మధ్య కాలాన్ని పరిశీలిస్తే పార్టీ మార్పులు మరింత పెరిగినట్లు స్పష్టంగా తెలుస్తుంది. ఈ దశలో దేశవ్యాప్తంగా సుమారు 35% మంది శాసనసభ్యులు కనీసం ఒకసారి పార్టీ మారారు. 2004 నాటికి రాజకీయ వ్యవస్థపై ప్రజల నమ్మకం 52%కి తగ్గింది. పట్టణ యువతలో ఈ శాతం 45కి పడిపోయింది. గ్రామీణ ప్రాంతాలలో మాత్రం ఇంకా 58% వరకు నమ్మకం కొనసాగింది. ఇది గ్రామీణ సమాజంలో రాజకీయ సంప్రదాయాలు ఇంకా బలంగా ఉన్నాయనే విషయాన్ని సూచిస్తుంది. 2010 తర్వాత రాజకీయ వ్యవస్థ మరింత వేగంగా మారింది. 2014 ఎన్నికలు ఒక కీలక మలుపుగా నిలిచాయి. ఆ సమయంలో ప్రజలలో రాజకీయ వ్యవస్థపై ఆశలు పెరిగాయి. 2014లో ప్రజల నమ్మకం మళ్లీ 58% వరకు పెరిగినట్లు అంచనాలు సూచిస్తున్నాయి. యువతలో రాజకీయాలపై ఆసక్తి కూడా పెరిగింది. 18 నుంచి 30 వయస్సు గల యువతలో నమ్మకం 42% వరకు చేరింది. కానీ ఈ ఆశలు ఎక్కువ కాలం నిలవలేదు. 2014 నుంచి 2024 మధ్య జరిగిన రాజకీయ పరిణామాలు ప్రజల విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. ఈ కాలంలో దేశవ్యాప్తంగా సుమారు 42% మంది శాసనసభ్యులు ఒకసారి లేదా అంతకంటే ఎక్కువసార్లు పార్టీ మారారు. కొన్ని రాష్ట్రాలలో ఈ శాతం 50 దాటింది. ఈ పరిణామాల ప్రభావంగా 2020 నాటికి రాజకీయ వ్యవస్థపై ప్రజల నమ్మకం 45%కి తగ్గింది. 2022 నాటికి అది 41%కి దిగజారింది. 2025లో నిర్వహించిన సర్వే ప్రకారం ఈ శాతం కేవలం 38 మాత్రమే.

యువత పరిస్థితి మరింత ఆందోళనకరం. 2009లో యువత ఓటింగ్ శాతం 58గా నమోదైంది. 2014లో అది 56గా కొనసాగింది. 2019లో అది 52కి తగ్గింది. 2024లో యువత ఓటింగ్ శాతం సుమారు 49గా నమోదైంది. ఈ గణాంకాలు యువతలో రాజకీయ నిరాసక్తత పెరుగుతున్నదానికి స్పష్టమైన సూచన. అదే సమయంలో యువతలో రాజకీయ వ్యవస్థపై సంపూర్ణ నమ్మకం ఉన్నవారు కేవలం 29% మాత్రమే ఉన్నారు. 1990లో ఇదే వర్గంలో నమ్మకం సుమారు 60%గా ఉండేది. సామాన్య ప్రజలలో కూడా విశ్వాసం తగ్గింది. 2025 నాటికి గ్రామీణ ప్రాంతాలలో రాజకీయ వ్యవస్థపై నమ్మకం 41%గా ఉంది. పట్టణ ప్రాంతాలలో అది 34% మాత్రమే. మధ్యతరగతి వర్గంలో ఈ శాతం 31కి పడిపోయింది. కార్మిక వర్గాలలో మాత్రం ఇంకా 46% వరకు నమ్మకం కొనసాగుతోంది. ఇది ఆర్థిక అస్థిరత సమయంలో కూడా రాజకీయ వ్యవస్థపై ఆశలు పూర్తిగా చచ్చిపోలేదనే సంకేతంగా చూడవచ్చు. పార్టీ మార్పుల ప్రభావం ప్రజల మనసుల్లో తీవ్రంగా పడింది. 2024లో నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం పార్టీ మార్పుల కారణంగా ప్రజల రాజకీయ విశ్వాసం సగటున 15% మేర తగ్గినట్లు అంచనా వేయబడింది. కొన్ని రాష్ట్రాలలో ఈ తగ్గుదల 20% వరకు నమోదైంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం వల్ల ప్రజల నమ్మకం మరో 10% మేర తగ్గిందని అదే అధ్యయనం పేర్కొంది. అంటే మొత్తం మీద ప్రజాస్వామ్య విశ్వాసం దాదాపు 25% మేర దెబ్బతిన్న పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామాల ప్రభావం ప్రజాస్వామ్య భవిష్యత్తుపై తీవ్రంగా పడే అవకాశం ఉంది. రాజకీయ వ్యవస్థపై ప్రజల నమ్మకం 30% కంటే దిగజారితే ప్రజాస్వామ్య ప్రక్రియకు ప్రమాదం ఏర్పడుతుందని రాజకీయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. 2026 నాటికి దేశవ్యాప్తంగా నమ్మకం 38% స్థాయిలో ఉండడం ఒక హెచ్చరికగా చూడాలి. ఈ శాతం 2030 నాటికి 30కి దిగజారితే ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికల యంత్రాంగంగా మాత్రమే మిగిలిపోయే ప్రమాదం ఉంది. అయితే పరిస్థితి పూర్తిగా నిరాశాజనకంగా ఉందని చెప్పలేం. సరైన సంస్కరణలు అమలులోకి వస్తే ప్రజల నమ్మకం మళ్లీ పెరిగే అవకాశాలు ఉన్నాయి. పార్టీ మార్పులపై కఠిన నిబంధనలు అమలైతే 5 సంవత్సరాలలో ప్రజల విశ్వాసం కనీసం 15% మేర పెరిగే అవకాశం ఉందని అంచనాలు సూచిస్తున్నాయి. అంటే 2026లో ఉన్న 38% నమ్మకం 2031 నాటికి 53% వరకు చేరవచ్చు.

యువతలో రాజకీయ అవగాహన పెంచే కార్యక్రమాలు అమలైతే యువత విశ్వాసం 29% నుంచి 55% వరకు పెరిగే అవకాశం ఉంది. విద్యా సంస్థలలో ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెరిగితే ఈ మార్పు సాధ్యం. గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికే ఉన్న 41% నమ్మకం 60% వరకు చేరవచ్చు. పట్టణ ప్రాంతాలలో ప్రస్తుతం ఉన్న 34% నమ్మకం 50% దాటే అవకాశం ఉంది. ప్రజల భాగస్వామ్యం పెరగడం కూడా కీలకం. ప్రజలు కేవలం ఓటు వేసే వరకు మాత్రమే పరిమితం కాకుండా రాజకీయ ప్రక్రియను నిరంతరం పరిశీలిస్తే నాయకులపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ ఒత్తిడి వల్ల పాలనలో పారదర్శకత పెరుగుతుంది. పారదర్శకత పెరిగితే ప్రజల విశ్వాసం కూడా పెరుగుతుంది. 2020 నుంచి 2025 మధ్య పారదర్శక పాలన ఉన్న రాష్ట్రాలలో ప్రజల నమ్మకం సగటున 10% ఎక్కువగా ఉన్నట్లు కొన్ని అధ్యయనాలు సూచించాయి. మీడియా పాత్రను కూడా విస్మరించలేం. ప్రజలకు సరైన సమాచారం అందినప్పుడు రాజకీయాలపై అవగాహన పెరుగుతుంది. అవగాహన పెరిగితే భావోద్వేగాల కంటే ఆలోచన ఆధారంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ మార్పు దీర్ఘకాలంలో ప్రజాస్వామ్యానికి బలమైన పునాది వేస్తుంది. 2010 తర్వాత మీడియా విశ్వసనీయత తగ్గడంతో ప్రజల రాజకీయ అవగాహన కూడా ప్రభావితమైందని విశ్లేషణలు చెబుతున్నాయి. మీడియా విశ్వసనీయత 2010లో 62% ఉండగా 2025 నాటికి అది 44%కి పడిపోయింది. ఇది కూడా ప్రజాస్వామ్య విశ్వాసంపై ప్రభావం చూపింది. భవిష్యత్తు దిశ స్పష్టంగా ఒక నిర్ణయాన్ని కోరుతోంది. రాజకీయ నాయకులు సిద్ధాంత నిబద్ధతను తిరిగి స్వీకరించాలి. పార్టీ మార్పులను రాజకీయ సంస్కృతిలో అపవాదంగా మార్చాలి. ప్రజల ఓటు విలువను గౌరవించే విధంగా వ్యవస్థను పునర్నిర్మించాలి. ఈ మార్పులు అమలైతే 2040 నాటికి ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకం మళ్లీ 65% దాటే అవకాశం ఉంది. లేకపోతే అదే శాతం 25కి దిగజారే ప్రమాదం కూడా ఉంది. ముగింపుగా చెప్పాలంటే ప్రజాస్వామ్యం సంఖ్యల ఆట కాదు; కానీ సంఖ్యల ద్వారా దాని ఆరోగ్యం అర్థమవుతుంది. 1950లో 75%గా ఉన్న ప్రజల నమ్మకం 2025లో 38కి పడిపోయింది అంటే ఇది సాధారణ తగ్గుదల కాదు; ఇది ఒక వ్యవస్థాత్మక హెచ్చరిక. ఈ హెచ్చరికను రాజకీయ నాయకులు పట్టించుకోకపోతే ప్రజాస్వామ్యానికి తిరుగులేని నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రజల నమ్మకాన్ని కేంద్రంగా పెట్టుకొని రాజకీయ వ్యవస్థను మలచాలి. ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్యానికి శ్వాస. ఆ శ్వాస కొనసాగితేనే ప్రజాస్వామ్యం జీవించి ఉంటుంది. లేకపోతే అది కేవలం చట్టాల సమాహారంగా మాత్రమే మిగిలిపోతుంది.




రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.